ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

గురువారం 17 జులై 2025



సాయిరాం.. సాయిరాం!

● వైభవంగా బాబా నగరోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో బుధవారం రాత్రి సాయిబాబా నగరోత్సవం వైభవంగా జరిగింది. గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో ఉన్న సాయిబాబా మందిరంలో జరుగుతున్న గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సహస్ర నామ పూజలు జరిగాయి. నాలుగు పూటలా షిరిడీ హారతులిచ్చారు. సాయంత్రం నగరోత్స వంలో విశేష పుష్ప, విద్యుద్దీపాలంకరణలో గంధర్వ వాహనంపై సాయినాథుడు దర్శనమిచ్చాడు. బ్యాంకు కచ్చేరీ, విచిత్ర వేషధారణలతో ఊరేగింపు సందడిగా సాగింది. భక్తులు బాబా నామస్మరణతో అడుగడుగునా కర్పూర నీరాజనాలు అర్పించారు. కాగా, గురుపౌర్ణమి ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ జరుగుతుందని మందిరం చైర్మన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

సమాచారం ఇవ్వకపోతే ఎలా?

● విజిలెన్స్ కమిటీలో పుస్తకాల పంపిణీ

● సభ్యుల ఆగ్రహం ● అధికారికి నోటీసులివ్వాలని కలెక్టర్ ఆదేశం

● ఎస్సీ, ఎస్టీ కేసులపై చర్చ

హాజరైన అధికారులు, సభ్యులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 16(ఆంధ్రజ్యోతి) : జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, సమావేశ మందిరంలో అజెండా పుస్తకాలను పంపిణీ చేసిన సాంఘిక సంక్షేమ శాఖ అధికారికి నోటీసులు ఇవ్వాలని కలెక్టర్ ఆనంద్, జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్ సాహెబ్‌ను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. సభ్యులకు ముందస్తుగా తెలియచేయకుండా, వారి సూచనలు, సలహాలను అజెండాలో పేర్కొనకుండా నేరుగా సమావేశంలో పుస్తకాలను పంపిణీ చేశారు. దీనిపై కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సంబంధిత అధికారులపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. కాగా, ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కేసులపై చర్చించారు. ఈ ఏడాది మే 31 నాటికి ఎస్సీ, ఎస్టీల మీద 88 రకాల కేసులు నమోదయ్యాయని, అవి దర్యాప్తు దశలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ త్రైమాసికంలో 35 కేసులకు రూ.15లక్షల పరిహారం ఇచ్చారని, ఇంకా చార్జిషీట్ నమోదు చేసి బాధితులకు పరిహారం ఇచ్చేందుకు రూ.2.7కోట్లు అవసరమని పేర్కొన్నారు. తదుపరి సమావేశం నాటికి పరిహార వివరాలు పూర్తి స్థాయిలో ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు లేవనెత్తిన పలు అంశాలపై కలెక్టర్ స్పందించారు. కరేడు భూములకు సంబంధించి 4800 ఎకరాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ మానిటరింగ్ కమిటీ సమావేశానికి అందరు సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సంబంధిత శాఖల హెచ్‌వోడీలు హాజరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ కృష్ణకాంత్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ శోభారాణి, కమిటీ సభ్యులు ఏసుబాబు, ప్రభాకర్, శ్రీరాములు, స్వచ్ఛంద సంస్థల తరఫున మురళీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్ కార్డు..

ఆగస్టులో పంపిణీ

కార్డుల కోసం 71,808 దరఖాస్తులు ● పేర్ల మార్పు కోసమే అత్యధికం

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులు అందచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతర ప్రక్రియ అయినా, తొలి విడతగా వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఆగస్టులో స్మార్ట్ రేషన్ కార్డులు అందచేయనుంది. మే 7వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డులకు, ఉన్న కార్డులలో మార్పులు, చేర్పులు, సవరణల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఇప్పటివరకు జిల్లాలో 71,808 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే రేషన్‌కార్డులలో పేర్ల జోడింపు కోసమే అధికంగా ఉన్నాయి. కొత్తగా కుటుంబ సభ్యుడి జోడింపు, వివాహమైన మహిళలు, పుట్టిన పిల్లలను చేర్పించాలని దరఖాస్తులు వచ్చాయి.

● పేర్లు చేర్చినా అందని రేషన్

సచివాలయాలలో రేషన్‌కార్డులలో పేరు చేర్పు కోసం దరఖాస్తు చేసి రెండు నెలలైనా చాలా మందికి సరుకులు అందటం లేదు. పేరు చేర్చిన వారి వివరాలు రాష్ట్రస్థాయిలో డైనమిక్ కీ రిజిస్టర్‌లో నమోదవుతాయని తెలిసింది. ఈ రిజిస్టర్‌లో ప్రతి నెలా 15వ తేదీలోపు పేరు నమోదైనప్పుడు వారికి మరుసటి నెలలో రేషన్ విడుదల చేసి ఇవ్వాలి. కానీ అలా జరగడం లేదు. రెండు నెలలైనా రేషన్ అందకపోవటంతో కొత్తగా పేరు చేర్చుకున్న వారు ఎవరికి చెప్పుకోలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా 15లోపు కార్డులో పేరు నమోదైన వారికే పక్క నెలలో రేషన్ ఇస్తారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎన్.విజయ కుమార్ తెలిపారు.

వచ్చిన దరఖాస్తుల వివరాలు	
మొత్తం దరఖాస్తులు	: 71808
కార్డుల్లో చిరునామాల మార్పు	: 1986
వివరాల మార్పు	: 354
ఆధార్ సీడింగ్ సవరణ	: 1318
చౌకధరల దుకాణాల రెన్యువల్	: 21
కార్డులలో పేర్లు చేర్చడానికి	: 49140
పేర్లు తొలగించడానికి	: 1846
కొత్తకార్డుల కోసం	: 9771
కార్డుల విభజన కోసం	: 7334
ప్రభుత్వానికి సరెండర్ చేసినవి	: 38

చెన్నై కాదు.. కాకినాడ!

● రేషన్ బియ్యం తరలింపునకు అధికారుల ఆదేశం?

● ఖర్చు పెరుగుతుందంటున్న మిల్లర్లు, వ్యాపారులు

● చెన్నై మార్గంలో పెరిగిన నిఘా

● గోదాముల్లో పేరుకుంటున్న నిల్వలు

● లోపాయికారి ఒప్పందం కోసం విశ్వప్రయత్నాలు

కావలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పేదోళ్ల బియ్యం బొక్కుతున్న అక్రమార్కులకు వింత సమస్య వచ్చి పడింది. మొన్నటిదాకా చెన్నై పోర్టుకు తరలిస్తుండగా, తాజాగా కాకినాడ పోర్టుకు తరలించాలని అధికారులు హుకుం జారీ చేశారు. దీనివల్ల రవాణా చార్జీలు పెరగడంతోపాటు చెక్‌పోస్టుల తనిఖీలతో తమ గుట్టు రట్టు అవుతుందని మదనపడుతున్నారు. కాగా గతంలో ఉన్న కృష్ణపట్నం పోర్టులో బియ్యానికి రెండు ప్లాట్‌ఫారాలను తిరిగి పునరుద్ధరించాలని అధికారులను కోరారు. అయితే వారి నుంచి సరైన సమాధానం రాకపోవటంతో రైస్‌మిల్లర్ల అసోసియేషన్ నాయకులు జిల్లాలోని ఓ అమాత్యుడిని కలిసి ప్లాట్‌ఫారాల గురించి చర్చించినట్లు తెలిసింది.

● చెన్నైకి ఆగిన రవాణా

వెంకటాచలం వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి నిఘా పెంచడంతో నెల రోజులుగా చెన్నై పోర్టుకు బియ్యం పంపకుండా ఆపేశారు. అదే సమయంలో చెన్నై పోర్టులో బయ్యర్లు కూడా బియ్యం ధరలను పూర్తిగా తగ్గించారు. గతంలో పోర్టుకు చేరవేసిన బియ్యానికి కిలోకు రూ.34 ఇస్తుండగా ఇప్పుడు 27 ఇస్తున్నారు. దీంతో నెల రోజులుగా బియ్యం రవాణాను మిల్లర్లు చెన్నై పోర్టుకు ఆపేశారు.

● పేరుకు పోతున్న నిల్వలు

మిల్లులో బియ్యం నిల్వలు పేరుకు పోతుండటంతో వాటిని ఎక్కడ అమ్మాలో వ్యాపారులకు అంతుపట్టడం లేదు. అయితే ఇంతలో అధికారులు మిల్లర్లపై దాడులు చేయడం ప్రారంభించారు. దీంతో వ్యాపారులు ఏదో ఒకవిధంగా చెన్నై పోర్టుకే బియ్యం రవాణా చేసేందుకు అక్కడ బయ్యర్లతో మాట్లాడుకుంటున్నట్లు తెలుస్తోంది. కావలి నుంచి చెన్నై పోర్టుకు టన్నుకు రూ.1100, నెల్లూరు నుంచి రూ.700 రవాణా ఖర్చు అవుతుంది. అదే కాకినాడకు కావలి నుంచి రూ.1800, నెల్లూరు నుంచి రూ.2300 వరకు ఉంటుంది. చెక్‌పోస్టులు కూడా ఎక్కువ ఉంటాయని ప్రతి చోట మామూలు చెల్లించుకునే దానికన్నా నెల్లూరుజిల్లా అధికారులకే ఆ మామూళ్లు ఇచ్చి చెన్నైకు వెళ్లడమే మేలని భావిస్తున్నారు. మిల్లులో నిల్వలు ఉంచే కొద్దీ అధికారుల దాడులు పెరిగే అవకాశాలు ఉండటంతో చెన్నై వైపే మొగ్గు చూపుతున్నారు. అధికారులు కాకినాడ పోర్టుకు వెళ్ల మని ఎంత చెప్పినా ససేమిరా అంటున్నారు.

● వ్యాపారులు సన్నాహాలు

గతంలో ఇళ్ల వద్దకు వచ్చే ఎండీయూ వాహనదారులు రేషన్ కార్డుదారుల నుంచి 10 రూపాయలకు కిలో బియ్యం కొనేవారు. అయితే, గతంలో కొంతమంది గుప్పెట్లోనే ఉన్న రేషన్ బియ్యం అక్రమ వ్యా పారం కూటమి ప్రభు త్వం వచ్చాక పోటీ ఏర్పడింది. వ్యాపారులే కాదు... రేషన్ డీలర్లే వినియోగదారుల వద్ద రూ.18 నుంచి 20 లకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆ బియ్యం చేతులు మారి రైస్ మిల్లు వద్దకు వెళ్లే సరికి రూ.25 పడుతోంది. మిలర్లు, ఖర్చులు, తరుగు తీసేస్తే పెంచిన ధరల ప్రకారం నష్టం వచ్చేలా ఉంది. దీంతో రేషన్ బియ్యాన్ని తగ్గించి కొనుగోలు చేయాలని వ్యాపారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

నిఘా పెంచాం

రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు మా దృష్టికి రావటంతో నిఘా పెంచి తనిఖీలు చేస్తున్నాం. చెన్నై కాకుండా కాకినాడ పోర్టుకు బియ్యం రవాణా చేయాలని ఎవరికీ చెప్పలేదు. ఏదైనా ప్రభుత్వ నిర్ణయం ఉంటే దానితో తమకు సంబంధంలేదు.

- విజయకుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

రావూరు గ్రామస్థులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

భూసేకరణపై రావూరులోనూ

నిరసన సెగ

● బీపీసీఎల్‌కు భూములు ఇవ్వం : గ్రామస్థుల తీర్మానం

కందుకూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడు మండలం కరేడులో భూసేకరణకు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న నిరసనలు సమసిపోకముందే గుడ్లూరు మండలం రావూరులోనూ నిరసన సెగ మొదలైంది. బీపీసీఎల్‌కు తమ భూములు ఇచ్చేదే లేదని గ్రామస్థులంతా ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. 'కాలుష్య కర్మాగారం మాకొద్దు.. మాభూములే మాకు ముద్దు..' అంటూ సచివాలయం వద్ద, గ్రామ ప్రధాన కూడళ్లలో బుధవారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రెండేళ్లుగా పరిశ్రమల కోసం భూసేకరణను వ్యతిరేకిస్తూ రావూరు గ్రామస్థులు ఐక్యంగా పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. తొలుత గత ప్రభుత్వంలోనే ఇండోసోల్ సోలార్ కంపెనీ కోసం చేవూరు, రావూరు, ఏలూరుపాడు గ్రామాల పరిధిలో 5400 ఎకరాల భూమిని సేకరించేందుకు జీవో విడుదల కాగా భూసేకరణను వ్యతిరేకిస్తూ రావూరువాసులు హైకోర్టును ఆశ్రయించారు. రైతుల సమ్మతితోనే భూములు తీసుకోవాలని లేనిపక్షంలో భూసేకరణ ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తూ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో గత నెల చివరి వారంలో కలెక్టర్ ఆనంద్, కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమాణి శ్రీపూజ, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి రావూరులో గ్రామసభ ఏర్పాటు చేసి భూములకు ప్రభుత్వంతో చర్చించి మంచి ధర వచ్చేలా చూస్తామని ప్రతిపాదించారు. ఆ సందర్భంగా ఎకరానికి రూ.20 లక్షలు పరిహారం అందేలా చూస్తామని కలెక్టర్, ఎమ్మెల్యే రైతులకు చెప్పారు. ఆ ధరకు కూడా భూముల ఇచ్చేందుకు సమ్మతించని గ్రామస్థులు ఒకే కట్టుబాటుగా ఉండాలని కనీసం రూ.30 లక్షలు పరిహారం ఇస్తే తప్ప విలువైన భూములను ఇచ్చేది లేదని తీర్మానించుకున్నట్లు సమాచారం. అయితే బుధవారం అసలు బీపీసీఎల్‌కే భూములు ఇవ్వబోమని కాలుష్యాన్ని వెదజల్లే పెట్రో కెమికల్ కర్మాగారాన్ని ఇక్కడ ఏర్పాటు చేస్తే తామెలా జీవించాలంటూ గ్రామస్థులు నూతన తీర్మానానికి శ్రీకారం చుట్టడం విశేషం. ఇది చర్చనీయాంశంగా మారింది.

'ప్యాక్స్'పై అదే

ఉత్కంఠ

సహకార సంఘాలకు కొత్త పాలకవర్గాల నియామకంలో ఏర్పడిన ఉత్కంఠకు ఇంకా తెరపడటం లేదు. ఆరు నెలలుగా పాలకవర్గాల నియామకంపై కసరత్తు జరుగుతున్నా ఇంకా కొలిక్కి రాలేదు. పలు జిల్లాల్లోని ప్రాథమిక సహకార సంఘాలకు (ప్యాక్స్) పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడుతున్నాయి. కానీ జిల్లాలో మాత్రం మోక్షం లభించడం లేదు. దీంతో ఆశావాహుల్లో రోజురోజుకీ ఉత్కంఠ పెరిగిపోతోంది. ఈ కమిటీల నియామకంలో తీవ్ర జాప్యం జరుగుతుండడం అటు ఎమ్మెల్యేలకు కూడా ఇబ్బందిగా మారుతోంది.

● ఇంకా అధికారుల పాలనలోనే సహకార సంఘాలు

● కొత్త కమిటీల నియామకంలో తీవ్ర జాప్యం

● పలు జిల్లాల్లో నియమిస్తూ ఉత్తర్వులు

● జిల్లాలో ఆశావహుల ఎదురుచూపులు

● ఆరు నెలల క్రితమే ఎమ్మెల్యేల నుంచి వెళ్లిన జాబితా

అల్లూరు : ప్రాథమిక సహకార సంఘం

నెల్లూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 76 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా, కొన్నేళ్లుగా ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాలను నియమిస్తూ వస్తున్నారు. ఆ క్రమంలోనే గత ప్రభుత్వంలో ఏర్పాటైన పాలకవర్గాలు ప్రభుత్వం మారగానే వైదొలిగాయి. ఆ తర్వాత సహకార శాఖాధికారులను ఈ సంఘాలకు ప్రత్యేకాధికారులుగా నియమించారు. పాలకవర్గ సభ్యులైతే స్థానికంగా ఉన్న రైతులే ఉంటారు కాబట్టి రైతులకు కూడా తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు సులభంగా ఉంటుంది. కానీ అధికారుల పాలనలో వారిని కలుసుకోవడమే రైతులకు ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ప్యాక్స్‌లకు కొత్త పాలకవర్గాలను నియమించాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఎమ్మెల్యేల నుంచి అర్హులైన వారి జాబితాను తెప్పించుకుంది. పార్టీ కోసం కష్టపడ్డ వారికి ఈ కమిటీల్లో ప్రాధాన్యతను ఇస్తూ ఎమ్మెల్యేలు జాబితా రూపొందించి పంపారు.

● మూడింటికే కమిటీలు

ఒక్కో కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. ఈ జాబితాలు తయారై ఆరు నెలలు కావస్తోంది. కానీ పాలకవర్గాలకు ప్రతిపాదనలు పంపినంత వేగంగా ఉత్తర్వులు వెలువడడం లేదు. అందులోనూ నెల్లూరు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మొత్తం 76 సంఘాలకుకాను ఇప్పటి వరకూ కేవలం మూడింటికి మాత్రమే కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మిగిలిన సంఘాలకు ప్రతిపాదించచబడ్డ నాయకులు.. ప్రభుత్వ ఉత్తర్వుల కోసం కళ్లల్లో ఒత్తులేసుకొని ఎదురుచూస్తున్నారు.

మూడు రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా 351 సహకార సంఘాలకు త్రీమెన్ కమిటీలను నియమిస్తూ జీవో విడుదలైంది. అయితే అందులో ఒక్కటి కూడా నెల్లూరు జిల్లాకు చెందినది లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం రెండో పంట సీజన్ నడుస్తోంది. మరో రెండు నెలల తర్వాత కీలకమైన రబీ సాగు మొదలవుతుంది. ఈ సమయంలో రైతులకు రుణాలు, ఎరువులు అంటూ అనేక అవసరాలు సహకార సంఘాలతో ఉంటాయి. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టింది. ప్రతీ సంఘం రికార్డులను, నిర్వహణను డిజిటల్ పద్ధతిలో చేయాల్సి ఉంటుంది. ప్యాక్స్‌లలో పారదర్శకతను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఈ ప్రక్రియ ప్రారంభించింది. జిల్లాలో నాలుగు సహకార సొసైటీలు మినహా మిగిలిన అన్ని సొసైటీల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయింది. ఈ క్రమంలోనే నూతన పాలకవర్గాలను నియమిస్తే సహకార సంఘాలకు నూతన ఉత్తేజాన్ని తీసుకొచ్చినట్లవుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కాగా కొత్త కమిటీల నియామకంపై జిల్లా సహకారశాఖాధికారి గుర్రప్ప 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఇప్పటివరకూ మూడు సొసైటీలకు కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వెలువడినట్లు చెప్పారు. మిగిలిన వాటికి ఉత్తర్వులు వెలువడాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.

'పంటల బీమా'లో

రైతులందరూ చేరాలి

నెల్లూరు(వ్యవసాయం), జూలై 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం చేస్తున్న ప్రతీ రైతు పంటల బీమా పథకంలో చేరాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో బుధవారం పంటల బీమా పథకంపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత బీమా పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీంతో వైపరిత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందుతుందని చెప్పారు. జిల్లాలో వరి, మినుము, శనగలు, పెసర, వేరుశనగ తదితర పంటలు సాగు చేస్తున్న రైతులందరూ ఈ పథకంలో చేరాలని సూచించారు. బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకునే రైతుల విషయంలో సంబంధిత బ్యాంకులు ప్రీమియం మొత్తాన్ని మినహాయించి బీమా కంపెనీలకు చెల్లిస్తాయని, పంట రుణాలు తీసుకోని రైతులు తమ సమీపంలోని సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, పోస్టాఫీసులు, పీఏసీఎస్ లలో ప్రీమియం చెల్లించవచ్చని చెప్పారు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్సు పోర్టల్‌లో మొబైల్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పంటల బీమా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశం లో జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి, ఎల్‌డీఎం మణిశేఖర్, బీమా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీఎల్‌కు మనోళ్లు

ఏడుగురు

● పలు ఫ్రాంచైజీల కొనుగోలు

● 8 నుంచి విశాఖలో పోటీలు

నెల్లూరు(విద్య), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఏడుగురు ఎంపికయ్యారు. ఈ టోర్నీకి సంబంధించి నిర్వహించిన వేలంలో జిల్లాకు చెందిన ఆటగాళ్లను పలు ఫ్రాంచైజీలు దక్కించుకున్నాయి. వీరిలో రంజీ క్రీడాకారుడు అశ్విన్ హెబ్బార్ అత్యధిక ధర పలికాడు. విజయ వాడ షన్‌షైనర్స్ యాజమాన్యం అశ్విన్‌ను రూ.10లక్షలకు కొనుగోలు చేసింది. అలాగే ఏసీఏ క్రీడాకారుడు, ఎంఆర్ఎఫ్ పేస్ ఫౌండేషన్ తరఫున ఆస్ట్రేలియాలో శిక్షణ పొందిన సాకేత్ రామ్‌ను రూ.2.20లక్షలకు రాయల్స్ ఆఫ్ రాయలసీమ, రంజీ క్రీడాకారుడైన రేవంత్‌రెడ్డిని రూ.1.4లక్షలకు భీమవరం బుల్స్ కొనుగోలు చేశాయి. అండర్-19 రాష్ట్ర క్రీడాకారుడు భార్గవ్ మహేష్‌ను రూ.60వేలకు అమరావతి రాయల్స్, పీ రోషన్‌ను రూ.60వేలకు సింహాద్రి వైజాగ్ లయన్స్, జోనల్ క్రీడాకారుడు టీ భరత్‌ను రూ.50వేలకు విజయవాడ షన్‌షైనర్స్, అండర్-16 ఎన్‌సీఏలో శిక్షణ పొందుతున్న తోషిత్ యాదవ్‌ను రూ.30వేలకు తుంగభద్ర వారియర్స్ కొనుగోలు చేశాయి. వీరంతా ఆగస్టు 8 నుంచి విశాఖపట్నంలో ప్రారంభమయ్యే ఏపీఎల్ పోటీల్లో సత్తా చాటనున్నారు. జిల్లా నుంచి ఏడుగురు ఎంపికవడంపై జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల స్వీకరణ

వెంకటాచలం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ లెక్చరర్ పోస్టుకు గెస్ట్ ఫ్యాకల్టీ కింద దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీ. వరప్రసాద్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు సంబంధిత సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 87901 88468 నెంబరును సంప్రదించాలని ఆయన తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9373
వెండి కిలో ధర	రూ. 114300
వెండి ఒక గ్రాము	రూ. 117.30

చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన

● నారాయణరెడ్డి, ఎంపీడీవో, బుచ్చి

బుచ్చిరెడ్డిపాళెం,జూలై16(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం దృష్ట్యా మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఇంటింటికీ చెత్త సేకరణపై (ఐవీఆర్ఎస్) ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఎంపీడీవో నారాయణరెడ్డి తెలిపారు.

? : మండలంలో ఎన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరిగింది.

! : మండలంలోని దామరమడుగు, రేబాల, నాగమాంబాపురం, పెనుబల్లిలో ఇంటింటి నుంచి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాం. పంచాయతీ అధికారులు, క్లాప్ మిత్రలు ద్వారా పారిశుధ్యం మెరుగుపరుస్తున్నాం.

? : చెత్తను ఎన్ని రకాలుగా సేకరిస్తున్నారు.. సేకరించిన చెత్తను ఎక్కడికి తరలిస్తున్నారు.

! : ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్తను సేకరిస్తున్నాం. సేకరించిన చెత్తను గ్రామ సమీపంలోని చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలిస్తాం. తడిచెత్తను ఎరువుగా మార్చి రైతులకు విక్రయించడం, పొడి చెత్తను సంబంధిత కంపెనీలకు విక్రయించి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీకి ఇస్తాం.

? :ఈ కార్యక్రమంతో ఇప్పటి వరకు ఎలాంటి ఫలితాలు సాధించారు.

! : తొలి విడతలో గత 6నెలలుగా 4 గ్రామ పంచాయతీలలో అంచలంచెలుగా ఇంటింటి నుంచి చెత్త సేకరించే కార్యక్రమం ద్వారా మురుగు కాలువల్లో దోమల ఉధృతిని తగ్గించాం. రోడ్డుమీద చెత్త చెదారాలు నివారించాం.

? : చెత్త సేకరణ కార్యక్రమాలు ఎవరి పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

! : జిల్లా స్థాయిలో డీపీవో జడ్పీ సీఈవో, డివిజన్ స్థాయి పంచాయతీ అధికారి, మండల స్థాయిలో ఎంపీడీవో, డిప్యూటి ఎంపీడీవో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది తోపాటు ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నాం.

గ్రామాల్లో పందుల బెడద

- రోగాలు వస్తాయేమోనన్న భయంతో ప్రజలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఒకవేళ స్పందించినా కంటితుడుపు చర్యలే...

వెంకటాచలం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో పందుల బెడదతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. మండలంలోని కాకుటూరు, చెముడుగుంట, గొలగమూడి, సర్వేపల్లి, వెంకటాచలం, ఇడిమేపల్లి, జంగాలపల్లి తదితర గ్రామాల్లో పందుల సంచారం ఎక్కువైంది. గ్రామాల్లో విపరీతంగా పందుల సంచారం ఉన్నా నివారణకు పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పందుల వల్ల మెదడువాపు వంటి ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. త్వరలో వర్షాకాలం మొదలు కానుండడంతో వీటి సంచారం వల్ల ఎక్కడ వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వేసవిలో ఒకటి,రెండుసార్లు వర్షాలు కురిసిన సమయంలో పందుల కారణంగా దుర్వాసన తీవ్రంగా ఉందంటున్నది. రోడ్లపై అవి మలవిసర్జన చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే పందులు ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి. జంగాలపల్లిలో పందులు తమ ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయని అక్కడి గిరిజనులు వాపోతున్నారు. తమను పందుల నుంచి విముక్తి కల్పించాలని జనసేన నేత బొబ్బేపల్లి సురేష్‌నాయుడుతో కలిసి అధికారులకు మొరపెట్టుకున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రజలు, మూగజీవాలపై దాడి చేస్తుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా వారు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు అన్నీ గ్రామాల్లో పందుల సంచారం పూర్తిగా లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాకుటూరులో సంచరిస్తున్న పందులు

నెల్లూరులో జీవిత ఖైదీ పరార్!

● ముమ్మరంగా గాలిస్తున్న పోలీస్ బృందాలు

వెంకటాచలం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఓ హత్య కేసులో జీవిత శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి మంగళవారం పరారయ్యాడు. వెంటనే అప్రమత్తమైన జైలు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముమ్మరంగా గాలిస్తున్నారు. సంగం మండలం గాంధీజన సంఘానికి చెందిన ఇండ్ల సురేష్ ఓ హత్య కేసులో 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. కొన్నేళ్లుగా నెల్లూరు సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. సత్ప్రవర్తన కింద సురేష్ సుమారు మూడేళ్ల నుంచి ఓపెన్ జైలులోని వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తున్నాడు. అయితే, మూడు రోజుల కిందట సురేష్‌ను చూసేందుకు కుటుంబ సభ్యులు రావడంతో వారిని చూసి ఎమోషనల్‌కు గురైనట్లు సమాచారం. ఈక్రమంలో సురేష్ తన దినచర్యలో భాగంగా ఓపెన్ జైలులో వ్యవసాయ పనులు చేస్తూ మంగళవారం సాయంత్రం అదృశ్యమయ్యాడు. జైలు అధికారులు ఖైదీలను లెక్కించే క్రమంలో సురేష్ రాలేదని గమనించారు. ఆ తర్వాత ఓపెన్ జైలులో పరిశీలించగా సురేష్ పరారైనట్లుగా గుర్తించి, వెంటనే జైలు ఉన్నతాధికారులతో పాటు అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించారు. వెంకటాచలం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. సంగం మండలంలోని గాంధీజన సంఘంతోపాటు బంధువుల ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో సురేష్ ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. కాగా సత్ప్రవర్తనలో భాగంగా సురేష్ త్వరలో జైలు నుంచి విడుదల కావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. కానీ ఇంతలో జైలు నుంచి కనిపించకుండా పరారయ్యాడు.

ఓటర్ల జాబితా నిర్వహణపై శిక్షణ

బుచ్చి : శిక్షణలో పాల్గొన్న బీఎల్వోలతో ఎన్నికల అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం,జూలై16(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని బీఎల్‌వోలకు బుధవారం శిక్షణ నిర్వహించారు. బుచ్చి పరిధిలోని 41మంది బీఎల్‌వోలకు నగర పంచాయతీ కమిషనర్ డీ బాలకృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారి బీ ప్రవీణ్‌కుమార్, కోవూరు ఎన్నికల డీటీ కేవీ.సురేష్‌బాబు, ఏఎల్‌ఎంటీ ఎన్. శ్రీనివాసులు, ఎన్నికల సీనియర్ సహాయకులు కేవీ.మోహన్‌రావు, యూ.రమణయ్య ఎన్నికల ఓటర్ల జాబితా నిర్వహణపై శిక్షణ ఇచ్చారు.

● **తోటపల్లిగూడూరు :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఓటర్ జాబితాలో మార్పులు చేర్పులు, సవరింపులు, తదితర విషయాలపై తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో బీఎల్ వోలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో సహాయ గణాంక సహాయకులు రాంప్రసాద్ పాల్గొని సూచనలిచ్చారు. బీఎల్‌వోలు అనుసరించాల్సిన విధానాలను ప్రయోగాత్మకంగా వివరించారు. 50 మంది బీఎల్‌వోలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డీటీ శివయ్య, ఆర్ఐ ఎస్.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మైపాడులో ఉచిత వైద్య శిబిరం

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇందుకూరుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైపాడు తూర్పుపాలెంలో సేవా భారతి ఆధ్వర్యంలో జయభారత్ ఆసుపత్రి నిర్వాహకులు బుధవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 100 మంది రోగులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాటంగారి హరిబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు కే. శ్రీనివాసులురెడ్డి, నాయకులు గాంధీ, చంద్రయ్య, పోలయ్య, శ్రీహరికోట వెంకటేశ్వర్లు, డాక్టర్లు ప్రత్యూష, సుబ్రహ్మణ్యం, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ పునర్‌నిర్మాణానికి పూజలు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు

పొదలకూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మించనున్న రామాలయ నిర్మాణంలో భాగంగా బుధవారం భక్తిశ్రద్ధలతో రాతి పూజలు నిర్వహించారు. ఇక్కడ పురాతనమైన రామమందిరాన్ని ఇటీవల తొలగించి, ఆ స్థానంలో కొత్తగా రూ.2కోట్లతో రామాలయాన్ని నిర్మిస్తున్నారు. తమిళనాడు శిల్పుల ఆధ్వర్యంలో ఈ నిర్మాణం జరగనున్నది. ఈ కార్యక్రమంలో ఉభయకర్తలు కే. చినబ్రహ్మయ్య, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు వాకాటి రాఘవేంద్ర, రామభక్తులు కలగట్ల శ్రీనివాసులు, మందా రామిరెడ్డి, చొప్పా వెంకటేశ్వర్లు, చాట్ల రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు

విడవలూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట విత్తనాలైన జిలుగలు, జనుము విత్తనాలను రైతులకు 50శాతం రాయితీతో ప్రభుత్వం అందజేస్తుందని వ్యవసాయశాఖ ఏడీఏ అనిత తెలిపారు. మండలపరిధిలోని ఊటుకూరు, అన్నారెడ్డిపాళెం గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిలుగలు, జనుమును పంటకోసిన తరువాత చల్లుకుంటే భూమి సారవంతంగా ఉంటుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన వారు స్థానిక వ్యవసాయాశాఖ అధికారిని కానీ రైతు సేవా కేంద్రాన్ని కానీ సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి లక్ష్మీ, వీఏఏలు చెంచులక్ష్మి, ప్రవీణ్, శ్రావ్య పాల్గొన్నారు.

మిర్చి లారీ బోల్తా : డ్రైవర్‌కి తీవ్రగాయాలు

కొడవలూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచర్లపాడు జాతీయ రహదారిపై బుధవారం మిర్చి లారీ బోల్తా పడగా, డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల మేరకు గుంటూరు నుంచి మిర్చిలారీ చెన్నైకి వెళ్తుండగా డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, డ్రైవర్‌ను 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్టు

తోటపల్లిగూడూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తట్టుగొల్లపాలెం గ్రామానికి చెందిన షేక్.సత్తార్‌పై, అదే గ్రామానికి చెందిన షేక్.షాహుల్, షేక్.సర్దార్, షేక్.దావూద్, షేక్.సుభాని పాత గొడవలను దృష్టిలో ఉంచుకుని ఈనెల 15 రాత్రి మసీదు సమీపంలో దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఎస్ఐ వీరేంద్రబాబు కేసు నమోదు చేసి, నిందితులను కాకుపల్లి సమీపంలో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

జగన్‌కు ఇక నో చాన్స్ : సోమిరెడ్డి

మహిళకు కరపత్రం ఇస్తున్న సోమిరెడ్డి

మనుబోలు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్‌కు ఇక నోచాన్స్ అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మడమనూరులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటా తిరిగి కరపత్రాలు అందించి, కనిపించిన అవ్వాతాతలను, పిల్లలను పలకరిస్తూ ఎమ్మెల్యే ముందుకు సాగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్‌హయాంలో మాజీ సీఎంతో సహ టీడీపీకి చెందిన చాలామంది నాయకులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఒక్క ఏడాదిలో మడమనూరుకి ఇటు అభివృద్ధి, అటు సంక్షేమ పథకాలతో కలిపి రూ. 9.70కోట్లు ఇచ్చామన్నారు. కాకాణి, ఆయన అనుచరులు గత ఐదేళ్లుగా దోపిడీలకు పాల్పడ్డారన్నారు. కావున అనుభవించక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, పార్టీ ప్రధాన కార్యదర్శి మధునాయుడు, కేసీపీసీ చైర్మన్ మస్తాన్ నాయుడు, నాయకులు నూనె లక్ష్మయ్య, చెమర్తి సుధీర్, ఉడతా విజయ్‌కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

అంకయ్యగౌడ్ మృతి టీడీపీకి తీరని లోటు

అంకితభావంతో పనిచేసే సీనియర్ నాయకుడు రావుల అంకయ్య గౌడ్(67)ను కోల్పోవడం టీడీపీకి తీరనిలోటని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మనుబోలులో బుధవారం వేకువన అంకయ్యగౌడ్ గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన నివాసానికి చేరుకుని గౌడ్ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం కుమారులు జితేంద్రగౌడ్, మోహన్‌రావులను పరామర్శించారు. బంధువులను, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల రాజకీయ నాయకులు అంకయ్యగౌడ్ మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ప్రసన్న వ్యాఖ్యలు హేయం

మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

కోవూరు, జూలై16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమా ర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు హేయమని టీడీపీ మైనార్టీ నాయకులు సయ్యద్ మసూద్, సమీఉల్లా, నాసీర్ అన్నారు. స్థానిక వీవీఆర్ కల్యాణమండపంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రసన్న వ్యక్తిగత దూషణలకు దిగడాన్ని సహించలేకపోతున్నామన్నారు. ప్రశాంతిరెడ్డి నియోజకవర్గ పరిధిలోని మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి సహించలేక ఆయన అసభ్యంగా మాట్లాడుతున్నారని చెప్పారు. వైసీపీ నాయకులు సైతం ఆయన తీరును ఛీకొడుతున్నారని వారు చెప్పారు. ఇకపై తమ నాయకురాలిని ఏదైనా అంటే సహించేదిలేదని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో జప్రుల్లా, సాధిక్, నజీర్, జమీర్, మహమ్మద్, షఫీ మాట్లాడారు.

కృష్ణపట్నం హైస్కూలులో సైన్స్‌ల్యాబ్

ప్రసంగిస్తున్న పోర్టు సీఈవో జగదీష్ పటేల్

ముత్తుకూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్, అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 18 డెస్క్‌టాప్ కంప్యూటర్లతో కూడిన ఎయిర్ కండిషన్డ్ కంప్యూటర్ సెంటర్, అన్నీ పరికరాలతో కూడిన సైన్స్ ల్యాబ్‌తో పాటు లైబ్రరీని కృష్ణపట్నం హైస్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేశారు. అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్‌పటేల్ సతీమణి చాందినీ పటేల్, కుమారుడు యష్ పటేల్‌తో కలిసి వీటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు కంప్యూటర్ ఆధారిత అభ్యాసాన్ని కార్పొరేట్ పాఠశాలలతో సమానంగా సన్నద్ధం చేయాలననే ఉద్దేశంతో కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమలో టీడీపీ నాయకులు, పోర్టు కార్పొరేట్ అఫైర్స్ ప్రతినిధులు మృత్యుంజయరామ్, వేణుగోపాల్, కోదండరామయ్య, హెచ్‌ఎం. సరళ, కృష్ణపట్నం, రాంనగర్, ఆర్కాట్‌పాలెం, గోపాలపురం గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు, కాపులు, తదితరులు పాల్గొన్నారు.

కోవూరులో న్యాయవాదుల ప్రదర్శన

ప్రదర్శన నిర్వహిస్తున్న న్యాయవాదులు

కోవూరు, జూలై16 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కోర్టుల్లో మధ్యవర్తిత్వం (మీడియోషన్) సెంటర్లను ఏర్పాటు చేసేందుకు సుప్రీంకోర్టు చర్యలు తీసుకోవడాన్ని హర్షిస్తూ పట్టణంలోని న్యాయవాదులు బుధవారం సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ న్యాయాధికారి పీ చైతన్య మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా చాలా సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. కేసులు రాజీకి వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ న్యాయాధికారి పీ కృష్ణయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీ.సునీల్‌కుమార్, సీహెచ్ చంద్రమోహన్, సీనియర్ న్యాయవాదులు సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, సలీమ్ తదితరులు మాట్లాడారు.

మొక్కుబడిగా మండల సమావేశం

కొడవలూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీ, సర్పంచులు ఎవరూ కూడా తమ గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాలేదు. దీంతో సమావేశానికి ప్రాధాన్యత లేకుండా పోయింది. ఈ సమావేశంలో ఎంపీడీవో సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని కోరారు. అలాగే అధికారులు గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ సురేష్, హౌసింగ్ ఏఈ ముక్తార్‌బాషా, వైద్యాధికారి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే సోమిరెడ్డి రాక

వెంకటాచలం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కసుమూరు పంచాయతీ శ్రీరామపురంలో గురువారం సుపరిపాలనలో తొలిఅడుగు - ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీరామపురం గ్రామానికి ఉదయం 9 గంటలకు ఆయన విచ్చేస్తారని పేర్కొంది.

పీ 4 సర్వేపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం,జూలై16(ఆంధ్రజ్యోతి): పీ 4 సర్వేపై బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

కండలేరు నీటి మట్టం 29.707 టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి): కండలేరు పూర్తి స్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 29.707 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్టా తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో నీరు ఏమి లేకపోగా, అవుట్ ఫ్లో హెడ్ రెగ్యులటర్ నుంచి 1900 క్యూసెక్కులు, లో లెవల్ స్లూయీస్ నుంచి 100 క్యూసెక్కులు మొత్తం 2వేల క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో అవుతుందని కండలేరు ఏఈ తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దర్గాబాబు (ఫైల్)

కావలి రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పేపాల దర్గాబాబు(62) మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య హైమావతి బుధవారం కావలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని సిరిపురంకు చెందిన దర్గాబాబు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి స్నానం చేసిన తరువాత ఇంటి ముందు ఇనుప రేకుల కింద ఇనుప పైపుకు కట్టిన తీగపై తడిచిన డ్రాయర్ వేయగా విద్యుత్ షాక్ తగిలి కేకలు వేస్తూ కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని బట్టలు ఆరేసుకునే తీగను పరిశీలించగా ఇంటికి విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ వైపు దెబ్బతిని రేకుల కింద పైపునకు తగిలి ఉండటంతో విద్యుదాఘాతానికి గురైనట్లు గుర్తించారు. రూరల్ ఎస్ఐ బాజీబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారైలు ఉన్నారు. దర్గాబాబు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇరువర్గాల ఘర్షణ : పలువురికి గాయాలు

● పిడతాపోలూరు వడ్డిపాలెంలో ఉద్రిక్తత

దాడుల్లో ధ్వంసమైన వాహనాలు

ముత్తుకూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడతాపోలూరు పంచాయతీ కట్టకింద వడ్డిపాలెంలో బుధవారం రెండువర్గాల ఘర్షణ ఉద్రిక్తతకు దారి తీసింది. దాడుల సమాచారం అందుకున్న కృష్ణపట్నం సీఐ రవినాయక్, ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. బాధితుల కథనం మేరకు, పాత గొడవలు మనసులో పెట్టుకుని గ్రామంలో ఒక వర్గం రెండో వర్గానికి చెందిన వారి ఇళ్లపై దాడులు చేశారు. దాడుల్లో ఆరుగురికి తీవ్రగాయాలు కాగా మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. రాము వర్గీయుల ఇళ్లలో ఉండగానే నెల్లూరు రవి వర్గానికి చెందిన వారు రాళ్లు, కర్రలు, రాడ్లతో తమపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తమను చంపేస్తామంటూ బెదిరించారన్నారు. పోలీసులు రావడంతో దాడి చేసిన వారు పరారయ్యారు. ఈ దాడుల్లో పది ఇళ్లలో పరికరాలు, ఆటోలు, మోటారు సైకిళ్లు ధ్వంసమయ్యాయి. గతంలో వైసీపీలో ఉన్నవారు టీడీపీలో చేరారని, ప్రస్తుతం జరిగిన దాడులు ఈ రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్నాయని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు స్థానిక నాయకులతో చర్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

బాధితులను విచారిస్తున్న సీఐ రవినాయక్

ఎరువుల దుకాణాల్లో విజి'లెన్స్'!

ఉదయగిరి : ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి/కలిగిరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై బుధవారం సెంట్రల్ స్క్వాడ్, విజిలెన్స్ అధికారులు వ్యవసాయ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. వినుకొండ ఏడీఏ సీహెచ్ రవికుమార్, ఒంగోలు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎన్ రాఘవరావులు ఉదయగిరిలోని పలు దుకాణాల్లో ఎరువులు, పురుగు మందుల క్రయ, విక్రయాల రికార్డులు, ఇన్‌వాయిస్ బిల్లులు, గోదాముల్లో నిల్వలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం శ్రీబాలాజీ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో రూ.12,7,64,437, శ్రీనరహరి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో రూ.49,18,159 విలువైన పురుగుమందులకు స్టాకు రిజిస్టర్, కంప్యూటర్ ఫార్మెట్‌లో ఎలాంటి సమాచారం లేనందున అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేశారు. అలాగే కలిగిరిలో బిల్లులులేని 41.85 మెట్రిక్ టన్నులు ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. నకిలీ పురుగుమందులు, విత్తనాలు, విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు. కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, పీ చెన్నారెడ్డి, ఉదయగిరి, కలిగిరి వ్యవసాయాధికారులు విజయభాస్కర్, జహీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వైద్యశాలలో విద్యార్థి మృతి

● ఘటనపై పలు అనుమానాలు

● మృతుడు సత్యసాయి జిల్లావాసి

నెల్లూరు(క్రైం), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాల మెడికల్ షాపులో పనిచేస్తున్న ఫార్మసీ విద్యార్థి బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఆ యువకుడి మృతిపై స్నేహితులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సేకరించిన సమాచారం మేరకు... సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన శ్రీకాంత్ నెల్లూరులోని సనా కళాశాలలో డీ ఫార్మసీ చదువుకుంటూ నగరం లోని మద్రాసు బస్టాండు సమీపంలో ఉన్న పెంచలయ్య వైద్యశాల లోని మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం వైద్యశాలకు వచ్చిన శ్రీకాంత్ మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి సిబ్బంది చికిత్స నిమిత్తం జయభారత్ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు సీరియస్‌గా ఉందని వెంటనే జీజీహెచ్‌కు తరలించాలని సూచించడంతో అక్కడకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీకాంత్ మృతి చెందాడు.

● మృతిపై అనుమానాలు

విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు జీజీహెచ్‌కు చేరుకుని శ్రీకాంత్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. వైద్యశాలలో పనిచేసే నర్సులు ఫిట్స్ వచ్చిందని చెబుతున్నారని, మరి కొందరు కరెంట్ షాక్ తగిలిందని చెప్పారని, అయితే వైద్యశాల యాజమాన్యం మాత్రం గుండెపోటు వచ్చిందని చెప్పడం అనుమానాస్పదంగా ఉందన్నారు. విద్యార్థి సమాచారం అందుకున్న చిన్నబజారు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు వారు శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100): 590

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు

నెల్లూరు(క్రైం), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో బుధవారం రాత్రి పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. ఆయా ప్రాంతాల్లో ఎటువంటి నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశించడంతో సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వెంగళరావు నగర్ ఏ, బీ బ్లాక్‌లలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

కత్తులతో బెదిరించడం...
కాసులు దోచుకోవడం!

- నగరంలో క్రైం కల్చర్
- రోజురోజుకు పెరుగుతున్న నేర ప్రవృత్తి
- ఒంటరిగా వెళ్లాలంటే భయం... భయం
- వరుస ఘటనలతో ప్రజల ఆందోళన
- వెలుగులోకి వస్తున్నవి కొన్నే... రానివి ఎన్నో!

నెల్లూరు(క్రైం), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న నెల్లూరు నగరంలో కత్తులతో బెదిరించి దోపిడీలు చేసే కల్చర్ ప్రారంభమైంది. ఒంటరిగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకొని మార్గమధ్యలో అడ్డగిం చి దోపిడీలకు పాల్పడుతున్నారు. అందినంత నగదు, నగలు దోచుకుని పారిపోతున్నారు. నగరంలో వరుసగా జరుగుతున్న ఇలాంటి సంఘటనలు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఒంటరిగా వెళ్లాలంటేనే భయపడే పరిస్థితిని తీసుకొస్తున్నాయి.

కత్తులతో బెదిరించిన వ్యక్తులను అరెస్ట్ చేసిన నవాబుపేట పోలీసులు (ఫైల్)

కత్తులతో తిరగడం ఫ్యాషన్

ప్రస్తుతం నెల్లూరు నగరం నేరాలకు అడ్డాగా మారిపోయింది. కొందరు యువకులు ఆకతాయిగా తిరుగుతూ జల్సాలు, ఈజీ మనీ కోసం నేరాలను ప్రవృత్తిగా మలచుకున్నారు. బైక్‌లలో, ప్యాంట్ జేబుల్లో, బొడ్డు దగ్గర, వీపు వెనుక కత్తులు దాచుకుని తిరగడాన్ని ఫ్యాషన్‌గా పీలవుతున్నారు. చిన్నచిన్న విషయాలకు కూడా ఆవేశపడిపోయి కత్తులను బయటకు తీసి వేసేస్తా అంటూ సినిమా డైలాగులు చెబుతున్నారు.

ఇటీవల కొన్ని కేసులు...

- నగరంలోని చంద్రబాబు నగర్‌కు చెందిన విజయ్ అలియాస్ వుండా, జీ సుధీర్, షేక్ సిరాజ్, పోలీసు కాలనీ ప్రాంతానికి చెందిన పీ అనిల్, బీ సాయికుమార్ చెడువ్యసనాలకు బానిసలుగా మారారు. వాటికి అవసరమైన డబ్బు కోసం దోపిడీలు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే ఈ నెల 11వ తేదీ సాయంత్రం తల్పగిరికాలనీ సమీపంలో ఎస్ నాగేంద్ర అనే వ్యక్తిని కత్తులతో చంపుతామని బెదిరించి అతని ఫోన్‌పే నుంచి రూ.5 వేల నగదును ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి వెళ్లిపోయారు.
- నగరంలోని వనంతోపు సెంటర్ హెచ్‌పీ పెట్రోలు బంకు ఎదురుగా జూన్ 25వ తేదీ మధ్యాహ్నం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అన్సార్ అనే వ్యక్తిని కత్తులు చూపించి చంపుతామని బెదిరించి అతని వద్ద రూ.1000 నగదు దోచుకెళ్లారు.
- నగరంలోని నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన బ్యాంకు ఉద్యోగి జూన్ 25వ తేదీ రాత్రి 11.45 గంటల సమయంలో తన కుటుంబ సభ్యులతో కలిసి మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తుండగా ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వెంబడించారు. సరిగ్గా ప్రధాన రైల్వే స్టేషన్ ఎదురుగా అడ్డగించి కత్తులు చూపించి భయపెట్టి డబ్బు లాక్కున్నారు. అదే రోజు రాత్రి తడికల బజారు అరుంధతీవాడలో ఒంటరిగా ఇంటి బయట నిద్రిస్తున్న మహిళను అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కత్తితో బెదిరించి డబ్బులు లాక్కున్నారు.
- నగరంలోని బోడిగాడితోట వద్ద మే 28వ తేదీ వెంకయ్య అనే వ్యక్తిని అడ్డగించి ఇద్దరు వ్యక్తులు కత్తులతో బెదిరించి నగదు దోచుకెళ్లారు.

ఇలా నగరంలోని అనేక ప్రాంతాల్లో కత్తులను చూపించి బెదిరించడం ఫ్యాషన్‌గా మారిపోయింది. అయితే వీటిలో కొన్నే పోలీసు స్టేషన్ల వరకు వెళ్తున్నాయి. బయటకు రానివి ఎన్నో ఉంటున్నాయి. ప్రేమికులు, మద్యం సేవించి ఒంటరిగా వెళ్లే వారు, లాడ్జీల నుంచి బయటకు వచ్చే వారు, అర్ధరాత్రి ఊర్ల నుంచి వచ్చే వారిని టార్గెట్ చేస్తూ ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారు. బాధితులు ఈ విషయాలను బయటకు చెప్పుకునేందుకు జంకుతున్నారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పరువు పోతుందన్న భావనతో మిన్నకుండిపోతున్నారు. ఏదేమైనా నెల్లూరు నగరంలో వరుస ఘటనలు, నేర ప్రవృత్తి పెరగడం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది.

మురుగు కాలువలపై నిర్మాణాలొద్దు

- నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మురుగు నీళ్ల పారే కాలువలపై ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని కార్పొరేషన్ కమిషనర్ నందన్ కోరారు. బుధవారం 6వ డివిజన్ శెట్టిగుంటరోడ్డు ప్రాంతంలో పర్యటించిన ఆయన స్థానిక డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులను పరిశీలించారు. మురుగు సాఫీగా ముందుకు వెళ్లాలంటే ఆక్రమణలు, కట్టడాలు ఉండకూడదన్నారు. ఇప్పటికే కాలువలపై నిర్మాణాలు చేపట్టిన వారు వాటిని తొలగించాలని సూచించారు. కాలువల్లో పూడికతీత పనులు తరుచూ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పీహెచ్ వర్కరుగా పనిచేస్తూ మరణించిన యరజాల కొండమ్మ కుమారుడు కొండలరావుకు కారుణ్య నియామకపు ఉత్తర్వులను తన కార్యాలయంలో అందచేశారు. భూగర్భ డ్రైనేజీ కార్మికులకు రక్షణ ఉపకరణాలను పంపిణీ చేశారు. వాటిని క్రమం తప్పక వినియోగించాలని సూచించారు. ఆయుష్మాన్ భవ ఆరోగ్య కార్డులను అందచేశారు.

డ్రైన్ కాలువను పరిశీలిస్తున్న కమిషనర్

డిమాండ్లు నెరవేరిస్తేనే విధుల్లోకి.. !

- కార్పొరేషన్ ఎదుట ఇంజనీరింగ్ కార్మికుల ఆందోళన

నెల్లూరు(సిటీ), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తమ న్యాయమైన డిమాండ్ల ను నెరవేరిస్తేనే విధుల్లోకి వస్తామంటూ మున్సిపల్ పారిశుధ్య విభాగం లోని ఇంజనీరింగ్ కార్మికులు స్పష్టం చేశారు. వారు చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పెంచల నరసయ్య, కత్తి శ్రీనివాసులు, నాగేశ్వర రావు మాట్లాడుతూ కార్మికుల మనోభావాలకు వ్యతిరేకంగా 9వ డివిజన్ పారిశుధ్య పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించే ప్రక్రియ జరుగుతోందని ఆరోపించారు. దీనిని తాము తీవ్రంగా వ్యతిరేఖిస్తున్నామని స్పష్టం చేశారు. పారిశుధ్య రంగంలో ఇంజనీరింగ్ కార్మికుల త్యాగాలకు విలువ లేకుండా పోతుందని, వారి కష్టానికి తగిన జీతం అందడం లేదని వాపోయారు. వెంటనే జీతాలు పెంచాలని, ఉద్యోగ విరమణ అనంతరం ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని, వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనకు ముందు బారాషహీద్ దర్గా నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మేయర్ స్రవంతికి వినతి పత్రం అందచేశారు.

కార్పొరేషన్ కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఘనంగా దర్గాబాబా మాతా జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చిల్డ్రన్స్ పార్కు సాయిసదన్‌లో బుధవారం దర్గాబాబా సతీమణి దర్గాబాబా మాత జయంతిని ఘనంగా నిర్వహించారు. మందిరం నిర్వాహకులు శ్రీనివాసులురెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి భక్తులకు పంచారు. సిద్ధమంగళ స్తోత్రం, ఆనఘ మాత స్తోత్ర పారాయణం చేశారు.

వారంతా మరో పార్టీని చూసుకోవాల్సిందే!

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరురూరల్, జూలై 16,(ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేతలంతా మరో పార్టీని చూసుకోవాల ని, జగన్‌రెడ్డి మారడని, మారబోడని ఆయన మీడియా సమావేశం ద్వారా తేటతెల్లమైందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. 2024లో ప్రజలు ఇచ్చిన తీర్పు అతనికి ఇప్పటికీ అర్థం కాలేదని, అర్థం చేసుకునే స్థితిలోనూ లేడని స్పష్టం చేశారు.

- ధనుంజయరెడ్డి మంచివాడని, ఎలాంటి తప్పు చేయలేదని సీబీఐకి లేఖ రాయగలవా? జగన్ అంటూ నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. జగన్ మీడియా సమావేశంపై స్పందించిన ఆయన ధనుంజరెడ్డి లాంటి మంచి అధికారి లేడని చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. జగన్ సైకో చర్యలకు పరాకాష్టగా ధనుంజరెడ్డి నిలిచిరని దుయ్యపట్టారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సత్కారం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పోకల వంశీ నాగేంద్ర మాధవ్‌ను ఆ పార్టీ జిల్లా నాయకులు సత్కరించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పరుసు మధు, నాయకులు తోట సుబ్ర మణ్యం నాయుడు, జయ కుమార్, సాయి ప్రసాద్ తదితరులు విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను సత్కరిస్తున్న జిల్లా నాయకులు

ఉప్పుటూరు రోడ్డుకు శంకుస్థాపన

నెల్లూరురూరల్, జూలై 16 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని కందమూరు- ఉప్పుటూరు గ్రామాల మధ్య రూ.2.5 కోట్లతో చేపడుతున్న రహదారి పనులకు బుధవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కక్షపూరిత రాజకీయాలు, వర్గాలు, కుల, మతాల మధ్య విభేదాలను తాను ప్రోత్సహించనని, అలాంటి వ్యక్తులను దగ్గరకు కూడా రాని వ్వనని చెప్పారు. ఈ రహదారిని 90 రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గంలోని మున్సిపల్ డివిజన్లు, పంచాయతీలన్నింటినీ గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ విజయ కుమార్, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

శిలా ఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే కోటంరెడ్డి, నాయకులు

లింగ నిర్ధారణపై డెకాయ్ ఆపరేషన్ : కలెక్టర్

నెల్లూరు (వైద్యం), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ వైద్య ఆరోగ్యశాఖను ఆదేశించారు. బుధవారం ఆయన చాంబర్‌లో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై జిల్లా కమిటీ సమావేశం జరిగింది. గర్భస్థ శిశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. లింగనిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు జిల్లా వైద్యశాలలు, స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు ఎక్కువగా నిర్వహించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వైద్యులు, స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీఎస్పీ రామారావు, డెమో కనకరత్నం, ఎన్‌జీవో కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం, ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది హజ్ యాత్రకు వెళ్లడానికి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా మైనార్టీల సంక్షేమ అధికారి షేక్ హైఫా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు తప్పనిసరిగా ఇంటర్నేషనల్ పాస్‌పోర్టు, బ్యాంకు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, ఫొటో కలిగి ఉండాలని వివరించారు. www.hazcommittee.gov.in వెబ్‌సైట్ ద్వారాగానీ, సువిధ మొబైల్ యాప్‌లోగానీ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అత్యవసరంలో తప్ప యాత్రను రద్దు చేసుకుంటే జరిమానా తప్పదన్నారు.

మైనార్టీ గురుకులంలో అడ్మిషన్లు

నెల్లూరు రూరల్ మండలంలోని అక్కచెరువుపాడులో ఉన్న మైనారిటీల గురుకుల పాఠశాల(బాలురు)లో 5 నుంచి 8వ తరగతి వరకు ప్రవేశపరీక్ష లేకుండా అడ్మిషన్లు జరుగుతున్నాయని హైఫా తెలిపారు. ప్రవేశం పొందగోరు వారు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణను కలవాలని కోరారు. వివరాలకు 8712625045 నంబరులో సంప్రదించాలని కోరారు.

- దేశంలోకెల్లా నెల్లూరులోనే ప్రసిద్ధి
- నాడు పల్లెల్లో సహజంగా దొరికేవి.. నేడన్నీ పెంపకం చేపలే !
- జాడే లేని బొమ్మిడాయిలు

కొర్రమేను.. దీని రుచే వేరబ్బా!

- అంతరిస్తోన్న అరుదైన చేపజాతులు
- పునరుత్పత్తిలో మత్స్యశాఖ నిర్లక్ష్యం

కోవూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మాంసాహార భోజన ప్రియులు కొర్రమేను చేపల పులుసులంటే లొట్టలేసుకు తింటారు. ఈ చేపల పులుసు కోసం వారు ఎంత ఖర్చయినా, ఎంత దూరమైనా వెళతారు. దేశంలోనే నెల్లూరు చేపల పులుసుకు ప్రత్యేక స్థానం ఉంది. అందులో కొర్రమేను సహకారమెంతో ఉందనడంలో అతిశయోక్తిలేదు. పలు చోట్ల ఈ చేపల్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన చెరువుల్లో పెంచుతారు. పెంచిన చేపకు, సహజసిద్ధంగా దొరికే చేపకు, రుచిలో తేడా ఉంటుందని చెబుతారు. గ్రామీణులకు ఎంతో ఇష్టమైన కొర్రమేను నేడు అందుబాటులో లేకుండా పోతోంది. కాలువలు, చెరువులు ఎండిన సమయంలో బురదలో ఈ చేప దొరుకుతుంది. ఇటీవల మారిన వాతావరణ పరిస్థితుల వల్ల ఈ చేప జాతి అంతరించి పోయే పరిస్థితి నెలకొంది. ఇప్పుడు పల్లెలో కొర్రమేను దొరకడం లేదు. మహానగరాల్లోని హోటళ్లల్లో పెంచిన కొర్రమేను చేపల పులుసును వడ్డిస్తు న్నారు. ఈ సీజన్‌లో కోవూరు సమీపంలోని మలిదేవి, బుచ్చిలోని కనిగిరి రిజర్వాయర్, విడవలూరు, వావిళ్ల, అల్లూ రు, అలగానిపాడులోని చెరువుల్లోనూ, ఇందుకూరుపేట పరిసర ప్రాంత చిన్నచిన్న కాలువల్లోనూ గతంలో కొర్రమేను విస్తారంగా దొరికేది.ఈ చేప పులుసు తింటే ఉబ్బసం వ్యాధి నయమవుతుందని పెద్దలు చెబుతారు.

నలుపైనా ఆకర్షణీయం

ఈ రకం చేప నలుపురంగులో ఉన్నా ఆకర్షణీయంగా కన్పిస్తుంది. చేపపై గోధుమరంగు చారలు కన్పిస్తాయి. బురదలో కూరుకుపోయినట్లుగా ఇవి జీవిస్తుంటాయి. బురద అడుగు భాగంలో నివసిస్తున్నందున చెరువులు, కాలువలు పూర్తిగా ఎం డిన సమయంలోనే వీటిని పట్టే వీలుంటుంది. ఏ ప్రాంతంలో కొర్రమేను లభిస్తుందో తెలిసిన జాలర్లు, అక్కడికి వెళ్లి బురదను తొలగించి కొర్రమేను చేతులతోనే పట్టేస్తారు.

బొమ్మడాయిలు ఏవీ!?

గతంలో బొమ్మడాయిల పులుసును కూడా మాంసాహార భోజన ప్రియులు లొట్టలేసుకుంటితినేవారు. జలాశయాల అడుగుభాగంలో బురదలో జీవించే ఈ చేపజాతి పూర్తిగా కనుమరుగైంది. వేసవిలో నీరు ఎండిన సమయంలో చిన్నచిన్న కాలువలు, వాగుల్లో ఇవి దొరికేవి. మాంసకృతులు ఎక్కువగా లభించే ఈ చేపను ఆహారంగా తీసుకొంటే పలు రోగాలు నయమవుతాయని చెబుతారు. ఆరోగ్యం కోసం బొమ్మడాయిల పులుసును ఆరగించేవారు. బాలింతలకు బొమ్మడాయిల పులుసును ప్రత్యేకంగా వండి వడ్డించేవారు. అలాంటి బొమ్మడాయి నేడు అందుబాటులో లేకుం డా పోయింది. కొన్ని నగరాల్లోనూ, హోటళ్లల్లో బొమ్మడాయిల పేరుతో నకిలీ చేప పులుసు వడ్డిస్తున్నారు.

అంతరిస్తోన్న అరుదైన మత్స్యసంపద

గతంలో పల్లెల్లోని కాలువలు, చెరువులు, గుంతల్లో వివిధ రకాల చేపలు జీవించేవి. కొర్రమేను, బొమ్మడాయిలే కాకుండా మట్టగుడెసెలు, పక్కెలు, బేడిసెలు, చందమామ బేడిసలు, చిరిమేని పక్కెలు లాంటివి అంతరించిపోయాయి. కాలువల్లో పెరుగుతున్న వివిధ రకాల సంప్రదాయ చేపపిల్లల్ని క్యాట్ ఫిష్, జిలేబీ రకాల చేపలు తినేస్తున్నాయి. కాలువలు, పంట పొలాల్లోని నీరు కలుషితమవుతున్నందువల్ల వీటి ఉనికి ప్రమాదకరంగా తయారైంది.

> **కొర్రమేను పెంపకం కష్టమే...**
>
> కొర్రమేనును సహజసిద్ధంగా పెంచడం కష్టమే. బుచ్చి, సంగం మండలాల్లో రెండు మూడుచోట్ల మంచినీటి గుంతల్లో కొరమేను పెంచుతున్నట్లు తెలిసింది. ఇక్కడి నీటికి కొర్రమేను పెంపకం వీలులేదు.
>
> **- సురేష్ బాబు, ఇన్‌చార్జి మత్స్యశాఖాధికారి, చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం, పడుగుపాడు.**

బొమ్మడాయిలు

మత్స్యశాఖ నిర్లక్ష్యం

మత్స్యశాఖ నిర్లక్ష్యం వల్ల అరుదైన జలపుష్పాలు అంతరించిపోతున్నాయి. జిల్లాలోనే దొరికే కొర్రమేను, బొమ్మడాయి, మట్టగుడెసెలు, బేడిసలు లాంటి రకాల్ని పునరుత్పత్తి చేయాల్సిన బాధ్యత మత్స్యశాఖపై ఉంది. కొన్ని చెరువుల్లో బొచ్చెలు, గడ్డిచేప పిల్లల్ని నామమాత్రంగా ఆ శాఖ సిబ్బంది వదులుతున్నారు. అరుదైన చేపల జీవనానికి అనుకూలమైన పరిస్థితుల్ని కల్పించాల్సిందిగా, ఆ రకాల పిల్లల్ని చెరువుల్లో వదలాల్సిందిగా రైతులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. అరుదైన చేప జాతులు అంతరించిపోకుండా కాపాడాల్సిన బాధ్యత మత్స్యశాఖాధికారులపై ఉంది.

మూడేళ్లు... 17 రాష్ట్రాలు

- కన్నడిగుడి సైకిల్ యాత్ర
- భిన్నత్వంలో ఏకత్వం కోసం : నాగరాజు

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : భారతదేశం అంటే భిన్నమతాలు, భిన్న భాషలు, భిన్న సంస్కృతులు, వైవిధ్య జీవనం. ఈ దేశంలో భిన్నత్వంలో ఏకత్వం సాధన కోసం, పర్యావరణ పరిరక్షణ, దేశభక్తిని ప్రచారం చేస్తూ కర్ణాట కలోని హసన్ జిల్లాకు చెందిన 60 ఏళ్ల నాగరాజు గౌడ అనే వ్యక్తి సైకిల్ యాత్ర చేస్తున్నారు. యాత్రలో భాగంగా ఆయన బుధవారం నెల్లూరు చేరుకు న్నారు. తన యాత్ర విశేషాలను వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. నాగరాజు గౌడ్ 2022 లో స్వరాష్ట్రం నుంచి సైకిల్ పై యాత్ర ప్రారంభించారు. మహారాష్ట్ర, గుజరాత్, రాజ స్థాన్, హర్యానా, పంజాబ్, హిమాచల ప్రదేశ్, ఉత్తరా ఖండ్ తదితర 17 రాష్ట్రాల మీదుగా యాత్ర సాగిస్తూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్నారు. ఈ ప్రయాణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, రాజస్థాన్ సీఎం అశోక్ గహ్లోత్, మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ సింగ్ తదితరలను కలుసుకు న్నారు. అలాగే సినీ ప్రము ఖులు సోనూసూద్, మనోజ్ తివారీ, గాంధేయవాది డాక్టర్ సుబ్బారావు వంటి వారి అభినందనలు అందుకున్నారు. కాగా, యాత్రలో రోజుకు సరా సరి 70 కి.మీ నుంచి 80 కి.మీ దూరం ప్రయాణిస్తుంటానని నాగరాజు తెలిపారు. రాత్రివే ళల్లో సత్రాలు, దేవాలయాల్లో బస చేస్తానని పేర్కొన్నారు. సొంత ఖర్చుతోనే సైకిల్ యాత్ర చేస్తున్నట్లు వెల్లడించారు.

సైకిల్ యాత్ర చేస్తున్న నాగరాజుగౌడ్

పాఠశాలకు డుమ్మాకొట్టిన అయ్యోరు సస్పెన్షన్

కావలి రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు తాళం వేసి విధులకు డుమ్మాకొట్టిన మండలం లింగంగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సాధినేని వెంకట కృష్ణారావును బుధవారం డీఈవో ఆర్.బాలాజీరావు సస్పెండ్ చేశారు. ఏకోపాధ్యాయుడిగా ఉన్న ఆయన ఎవరి వద్ద ముందస్తుగా అనుమతులు తీసుకోకుండా పాఠశాలకు తాళం వేసి రెండు రోజుల పాటు విధులకు గైర్హాజరన్న విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రుల ద్వారా తెలుసుకుని మీడియా బట్టబయలు చేసింది. దీంతో ఎంఈవోలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య లు ఆ పాఠశాలకు ముసునూరు క్లష్టర్ నుంచి బుధవారం ఉదయం మరో ఉపాధ్యాయినిని పంపి పాఠశాలకు వేసిన తాళం తీయించారు. కొం త సేపటి తరువాత వెంకటకృష్ణారావు విధులకు హాజరయ్యారు. రెండు రోజులపాటు పాఠశాలకు డుమ్మకొట్టడం, పాఠశాలలో పనిచేసే మహిళా సీఆర్పీపై అసభ్యంగా ప్రవర్తించటం, గతంలో షోకాజు నోటీసులు కూడా ఇచ్చినట్లు పంపిన రిపోర్టు ఆధారం గా డీఈవో సస్పెండ్ చేసినట్లు ఎంఈవోలు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పాపంపల్లి గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గంగులవారి చెరువుపల్లికి గ్రామానికి చెందిన పెంచలయ్య, పద్మలు పని నిమిత్తం మోటార్‌బైక్‌పై ఉదయగిరికి వచ్చి స్వగ్రామానికి వెళుతున్నారు. ఈతరుణంలో దాసరిపల్లి గ్రామానికి అర్షద్ నందిపాడు నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళుతుండగా పాపంపల్లి గ్రామ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అర్షద్, పెంచలయ్య, పద్మకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని నెల్లూరు తరలించారు.

ప్రసన్నను చెప్పులతో కొట్టే రోజులు దగ్గరలోనే..

ఆయన వ్యాఖ్యలను హైకోర్టే తప్పుబట్టింది : నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని మహిళలు చెప్పులతో కొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హెచ్చరించారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం కోటంరెడ్డి విలేకరులతో మాట్లాడారు. మహిళలను గౌరవించే సమాజంలో ప్రసన్న లాంటి వ్యక్తులు ఉండకూడదన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందంటే ప్రసన్న ఏ స్థాయిలో దిగజారుడు వ్యాఖ్యలు చేశారో అర్థమవుతుందన్నారు. ఇలాంటి వ్యక్తిని జిల్లా నుంచి తరిమివేసేం దుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. చెల్లెలి వరసైన ప్రశాంతి రెడ్డిపై మరోమారు అనుచిత వ్యాఖ్యలు చేస్తే నాలుక కోస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టి నాగేశ్వరరావు, కప్పిర శ్రీనివాసులు, ప్రశాంత్, కువ్వారపు బాలాజీ, అంచూరి శ్రీనివా సులు నాయుడు, నాని, పెంచలబాబు, నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

21, 22 తేదీల్లో తపాలా సేవలు బంద్

నెల్లూరు(హరనాథపురం), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తపాలా శాఖలో ఐటీ 2.0 అప్లికేషన్ విధానం అమలు చేస్తున్నందున ఈనెల 21, 22 తేదీలలో కార్యకలాపాలు జరగవని నెల్లూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కే శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నూతన విధానంతో రిజిస్టర్ పోస్టు, కవరు తదితరాలు డెలివరీ ఇచ్చినప్పుడు బుక్ చేసిన వ్యక్తికి అప్పటికప్పుడే ఎలాంటి ఆలస్యం లేకుండా మెసేజ్ వెళుతుందని తెలిపారు. ఉద్యోగులకు పనిభారం తగ్గుతుందని, వినియోగదారులకు సులభతరంగా సేవలు అందుతాయని తెలిపారు

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైం), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో జరిగిన చిన్న అగ్ని ప్రమాదంతో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరు లోని న్యూమిలిటరీ కాలనీలో ఉన్న కృష్ణ సాయి రెసిడెన్సీలో విక్రమ్‌కుమార్ రెడ్డి కుటుంబం నివసిస్తోంది. ఆయన తల్లి వెంకట సుబ్బమ్మ(76) ఈ నెల 6వ తేదీ ఇంట్లో దీపారాధన చేస్తుండగా ప్రమాదవ శాత్తు చీరకు నిప్పంటుకుంది. దీంతో ఆమెకు గాయా లయ్యాయి. కుమారుడు ఆమెను ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. విక్రమ్‌కుమార్‌రెడ్డి వేదాయపాళెం పోలీసుల కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మృతదే హాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చే మార్చి నెలాఖరుకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

- గృహనిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్

ఉదయగిరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను మార్చి నెలాఖరు నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని హౌసింగ్ శాఖ పీడీ వేణుగోపాల్ సూచించారు. బుధవారం మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి గ్రామం వద్ద గల లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్‌లో ఆప్షన్-3 కింద గుత్తేదారుడికి 141 ఇళ్లు అప్పగించగా 136 ఇళ్ల నిర్మాణం బేస్‌మెంట్ స్థాయిలో ఉందన్నారు. దీంతో గుత్తేదారునితో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతాప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ పీరాన్, ఏఈ రామకృష్ణ, వర్కుఇనస్పెక్టర్లు హర్షవర్ధన్‌రెడ్డి, చెన్నరాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంగిరెడ్డిపల్లి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ వేణుగోపాల్

నెలాఖరు లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

●సీతారామపురం: లబ్ధిదారులందరూ ఈ నెలాఖరు లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేసేలా చూడాలని హౌసింగ్ పీడీ వేణుగోపాల్ సిబ్బందికి సూచించారు. బుధవారం మండల పరిధిలోని దేవరాజు సూరయపల్లి, సీతారామపురం హౌసింగ్ లేఅవుట్‌ని పీడీ ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి డిఈఈ పీరాన్, ఏఈ రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ చెన్నరాయుడు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి

- కుటుంబ సభ్యుల ఆందోళన
- నిందితుల దుకాణంపై రాళ్లతో దాడి

ఉదయగిరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గల అల్‌ఖైర్ ఫంక్షన్ హాలులో ఆస్తి, ఆర్థిక లావాదేవీల కారణంగా షేక్ మహ్మద్ హమీద్‌ను అత్యంత దారుణంగా హత్య చేసిన గుంటుపల్లి ఉమర్‌అలీ, హనీఫ్‌లను కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన హమీద్‌ను హత్యచేసినా ఇంత వరకు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోకపోవడంతో పాటు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడంలేదని కన్నీరుమున్నీరయ్యారు. హమీద్ హత్య కేసులో అసలైన నిందితులను పట్టుకోకుండా విచారణ పేరుతో కొంతమందిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ అల శ్రీను తన సిబ్బందితో బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని రెండు రోజుల్లో నిందితులను పట్టుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీగా నినాదాలు చేస్తూ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని అక్కడ కూడా నిరసన వ్యక్తం చేశారు. అలాగే ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్ గండిపాళెం మార్గంలో హత్య కేసులో నిందితులైన గుంటుపల్లి ఉమర్‌అలీ, హనీఫ్‌ల సెల్‌ఫోన్ దుకాణంపై నిరసనకారులు రాళ్ల దాడి చేశారు. ఈ దాడిలో నేమ్‌బోర్డు, విద్యుత్ మీటర్లు ధ్వంసమయ్యాయి. అనంతరం నిందితుల స్వగ్రామమైన వెంగళరావు నగర్‌కు చేరుకోని వారి నివాసాలపై దాడిచేసి గేట్లు, సామగ్రి ధ్వంసం చేశారు.

నిరసనకారులతో చర్చిస్తున్న ఎస్ఐ శ్రీను

స్మార్ట్ మీటర్లు వద్దు!

- రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష, ప్రజా సంఘాలు

నెల్లూరు (వైద్యం), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు వద్దని, పాత మీటర్లనే కొనసాగించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. నెల్లూరులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలనే నేటి ప్రభుత్వం కొనసాగిస్తోందని విమర్శించారు. దీనిపై వామపక్ష పార్టీలు ఒక్క తాటిపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపుతో ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని, దీన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి మాలకొండయ్య, నగర కార్యదర్శి అరిగెల సాయి, సహాయక కార్యదర్శి సిరాజ్, నాయ కులు పముజుల దశరథ రామయ్య, రామరాజు, చల్లా నరసయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్, గంగపట్నం రమణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నంది పోగు రమణయ్య, ఏఐటీయూసీ నాయకులు అంజనేయులు, శంకర్ కిశోర్, మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి అరిగెల సాయి

కరేడు ఉద్యమాన్ని తప్పుదారి పట్టించే కుట్ర

రాజకీయరంగు పులమొద్దు

- జగన్‌ను కలవడం గ్రామస్థుల వ్యక్తిగతం
- జేఏసీకి ఎలాంటి సంబంధం లేదు
- రామచంద్ర యాదవ్‌ను కలుస్తాం : జేఏసీ

ఉలవపాడు, జూలై 16(ఆంధ్రజ్యోతి) : ఇండోసోల్ సోలార్ భూసేకరణపై కరేడు గ్రామస్థులు, రైతులు ఉవ్వెత్తున ఎగిసిపడేలా ఉద్యమం చేస్తుంటే రాజకీయ స్వలాభం కోసం కొందరు తమ సొంత నిర్ణయాలతో ఉద్యమాన్ని పక్కదోవ పట్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని కరేడు జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులు క్రితం వైసీపీ అధినేత జగన్‌ను కరేడు గ్రామం నుంచి కొందరు కలిసిన దానిపై వివరణ ఇచ్చేందుకు బుధవారం కరేడు గ్రామం రైతు ఉద్యమ జేఏసీ సమావేశం అయింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం కరేడు గ్రామంలోని 16 శివారు గ్రామాల ప్రజలతో కలిసి జేఏసీ ఏర్పాటు చేసుని కలిసికట్టుగా పోరాటం చేయ్యాలని దేవుడి గుడిలో ప్రమాణం చేశామన్నారు. మంగళ వారం మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వాలని వైసీపీ నాయకులు విషయం తెలియపరిచినప్పటికీ జేఏసీ నాయకులు ఎవ్వరు వెళ్లకూడదని, రైతుల ఉద్యమం రాజకీయ రంగు పులుపుకుంటుందని నిర్ణయించుకున్నామన్నారు. అయితే జేఏసీలో చైర్మన్‌గా ఎన్నుకున్న వ్యక్తి గ్రామంలోని మరికొందరితో కలిసి మంగళవారం ఉదయం జగన్‌ను కలిశారన్నారు. రైతులమని జగన్‌ను కలిసిన వారిలో ఎక్కువ మందికి సెంటు భూమి కూడా లేనివారు కావడం విశేషమ న్నారు. జగన్‌ను కలిసిన గ్రామస్థులకి జేఏసీకి ఎలాంటి సంబంధం లేదని అది వారి వ్యక్తిగత రాజకీయ వ్యవహారమన్నారు. కరేడు రైతుల ఉద్యమానికి ప్రత్యక్ష మద్దతు ఇచ్చిన బోడే రామచంద్రయాదవ్ కరేడు రైతుల చర్యలను నిరసిస్తు రైతుల ఉద్యమానికి బీసీవై పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ప్రకటించడం కరేడు గ్రామస్థుల మనసును కుంగదీసిందన్నారు. కరేడు రైతుల ఉద్యమాన్ని అన్ని విధాల ముందుండి నడిపించిన ఆయన మద్దతు ఉండాలని, అందుకు ఆయనను కలుస్తామన్నారు. త్వరలోనే జేఏసీని కమిటీ ప్రకాశన చేస్తామని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న కరేడు జేఏసీ నాయకులు

18 నుంచి పీ- 4 పునఃపరిశీలన గ్రామ సభలు

సీతారామపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు పీ-4 పునఃపరిశీలన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో అప్పాజీ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను ఏర్పాటుచేసి గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో మ్యాపింగ్ చేయించేలా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9373
వెండి కిలో ధర	రూ. 114300
వెండి ఒక గ్రాము	రూ. 117.30

అన్నారెడ్డిపాళెంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానం

●రోడ్డుపై మురికినీరు ● దుర్గంధంతో ప్రజల అవస్థలు ● పట్టించుకోని అధికారులు

సంగం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. కొన్ని చోట్ల డ్రైనేజీనీరు వెళ్లే మార్గంలేక నిలిచిపోయి దోమలకు, పందులకు ఆవాసంగా తయారైంది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2014 -19 మధ్యలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేయడంతో సుమారు రూ. 60 లక్షలతో సిమెంట్ రోడ్లు మంజూరయ్యాయి. దీంతో ఎస్సీ, ఎస్టీ కాలనీలతో పాటు ప్రధాన గ్రామంలో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేశారు. అయితే అప్పటికే ఉన్న డ్రైనేజీలో మురికి నీరు బయటకు వెళ్లే మార్గంలేక రోడ్డుమీద ప్రవహిస్తున్నాయి. దీంతో రోడ్డు మీదకు రాకుండా కట్టపోయడంతో గుంతలో మురికినీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీనివల్ల గ్రామం సెంటర్‌లోని గాందీబొమ్మ రచ్చ వద్ద అపరిశుభ్రంగా తయారైంది. అదేవిధంగా శివాలయానికి ఎగువన ఉన్న ఎస్టీ కాలనీలో సిమెంట్ రోడ్డు వేసి డ్రైనేజీ నిర్మించలేదు. కాలనీ ఇళ్లన్నీ పల్లంలో ఉన్నాయి. దీంతో ఇళ్లలోని మురికినీటితోపాటు, వర్షపునీరు వెళ్లే మార్గం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చావడి వీధిలో నిలిచిపోయిన డ్రైనేజీ నీరు

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

●ఎంఈవో డీ. సాయిప్రసాద్

ఏఎస్ పేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వసతులు ఉన్నాయని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈవో డి సాయిప్రసాద్ కోరారు.

? ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి.

! ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్, షూ, యూనిఫాం అన్నీ ఉచితంగా అందిస్తున్నాం. ప్రతిరోజూ మధ్యాహ్నం సన్న బియ్యంతో రుచికరమైన భోజనం పెడుతున్నాం. హైస్కూళ్లలో ఆటలు ఆడుకోవడానికి విశాలమైన మైదానాలతో అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

? విద్యాబోధన ఎలా ఉంది.

! నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. దీనితో 2024-25 విద్యా సంవత్సరంలో 589 మార్కులతో మండల టాపర్‌గా నిలిచాం. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మంచి ఫలితాలు సాధిస్తున్నాం.

? ఇంగ్లీషు మీడియం అందుబాటులో ఉందా.

! దాదాపు మండలంలోని అన్ని హైస్కూళ్లలో ఇంగ్లీషు మీడియం అందుబాటులో ఉంది. విద్యార్థులకు సులభంగా అరమయ్యే విధంగా బోధన అందిస్తున్నాం.

? ఉపాధ్యాయుల కొరత ఉందా.

! మండలంలో ఎక్కడా ఉపాధ్యాయుల కొరత లేదు. హైస్కూల్ విద్యార్థులకు ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో ఉపాధ్యాయుడు ఉన్నాడు.

సూపర్ సిక్స్ పథకాల అమలులో ముందడుగు

● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

మర్రిపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల అమలులో ముందడుగు వేశాం.. మలి అడుగులో ఏం చేస్తామో ప్రజలకు వివరిస్తున్నామని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం మర్రిపాడు మండల కేంద్రంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి మంత్రి ఆనం పర్యటించారు. రూ. 47కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం చేసిన 10.50లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోస్తూ, ప్రజలకు సంక్షేమ పథకాలతోపాటు సమయానికి ఉద్యోగులకు జీత భత్యాలను అందిస్తున్నామన్నారు. ఆత్మకూరులో సింహపురి యూనివర్సిటీ ఆధ్వర్యంలో 6 కోర్సులతో ఇంజనీరింగ్ కళాశాల మంజూరుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని, అందుకు చర్యలు వేగవంతం అవుతున్నట్లు, భవనాల నిర్మాణానికి 15 ఎకరాలు భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈఏడాది నుంచే అడ్మిషన్లు ప్రారంభించేందుకు అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. మొదట రెండు సంవత్సరాల పాటు నెల్లూరు విఆర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు, శాశ్వత భవనాల నిర్మాణాలు పూర్తవ్వగానే ఆత్మకూరులో కొనసాగేలా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల రైతులకు సాగు, తాగు నీటి కోసం గతంలో రూ. 1800 కోట్లతో ప్రారంభించిన హైలెవెల్ కెనాల్ పనులు గత పాలకుల నిర్లక్ష్యంతో అర్ధాంతరంగా ఆగిపోయాయని, ప్రారంభానికి ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. ఆగస్టు 1,2 తేదీలలో ఆత్మకూరులో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత ఓ ఎన్నారై ఏర్పాటుచేసిన కంటి పరీక్షల కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ కేశవ చౌదరి, ఆత్మకూరు ఆర్డీవో పావని, సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు డి గంగాధర్, సీనియర్ నాయకులు ఆరికట్ల జనార్ధన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం, పక్కన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితరులు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే కాకర్ల

దుత్తలూరు(ఉదయగిరి): అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండలంలోని సోమలరేగడ గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లంపాటి గురవయ్యనాయుడు, ఉండేలా గురవారెడ్డి, శ్రీకుర్తి రవీంద్ర బాబు, చీదర్ల మల్లికార్జున, కాకర్ల మధు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●సంగం : మండలంలోని తరుణవాయిలో టీడీపీ మండల అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, మాజీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈసంర్భంగా వారు ఇంటిం టికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు పొందిన కుటుంబాల వివరాలను మై టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●వింజమూరు: మండలంలోని కిస్తీపురం పంచాయతీలో బుధవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం టీడీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూడా నరసారెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు, పాములపాటి మాల్యాద్రి, లక్కు వెంకటేశ్వర్లు, కంచర్ల శ్రీనివాసులు, ములి కృష్ణ, మూలి రమేష్, కంచర్ల మాల్యాద్రి, సాన శ్రీనివాసులు, మూలి రత్నం, కుమిత ఓబుల్‌రెడ్డి, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంగం : తరుణవాయి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

వింజమూరు: ఇంటింటికి తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

న్యూస్ బాక్స్

ఘనంగా గంధమహోత్సవం

ఉదయగిరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షాదీమంజిల్ సమీపంలో ఉన్న సయ్యద్ హజరత్ పాషావలి గంధ మహోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా హక్కుదారుల ఇంటి నుంచి గంధాన్ని పకీరు జరుబులు, మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. ప్రత్యేక ప్రార్థనల అనం తరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించడంతోపాటు భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

సంగం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి శశిధర్ రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో వరి పొలాలను పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో రైతులకు తెగుళ్ల నివారణ, కలుపు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ మహాసభను విజయవంతం చేయాలి

ఆత్మకూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న జాతీయ బీసీ మహాసభకు జిల్లా వ్యాప్తంగా బీసీలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీసీ ఎంప్లాయిస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం నాగేశ్వరరావు, జిల్లా బీసీ ఎంప్లాయిస్ కార్యదర్శి కటారి సుధాకర్ పిలుపునిచ్చారు. బీసీలకు చట్టసభలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, స్థానిక సంస్థల్లో 42 శాతం, మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలని, కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు తదితర అంశాల సాధనకు నిర్వహిస్తున్న బీసీ మహాసభకు పెద్ద సంఖ్యలో బీసీలు తరలిరావాలని వారు కోరారు.

నేడు బీఎల్‌వోలకు శిక్షణ

ఉదయగిరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం మండలంలోని బూత్ లెవల్ అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఎల్ రాంమోహన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణకు ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళి పాల్గొంటారన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన

సాగరంలో ఆందోళన చేస్తున్న రైతులు

అనంతసాగరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద బుధవారం యూరియా కోసం రైతులు ఆందోళన చేశారు. యూరియా కోసం రైతులు భారీగా తరలి రావడం, స్టాక్ తక్కువగా ఉండడంతో కార్యాలయ సిబ్బంది వెనుతిరగడంతో రైతులు ఆందోళన చేశారు. వారికి సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు సంఘీభావం తెలుపగా బస్టాండ్‌లో రోడ్డుపై బైఠాయించి యూరియా ఇవ్వాలని నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు వచ్చి సమస్య పరిష్కరించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది వచ్చి యూరియాను ప్రాధాన్యతను బట్టి రైతులకు సర్దుబాటు చేశారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

మృతుల కుటుంబాలకు నగదు అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల మృతిచెందినవారి కుటుంబ సభ్యులకు బుధవారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి వారి ఇళ్లకు వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. 2వ వార్డు పరిధిలోని రాగి పెంచలయ్య, 13వ వార్డు పరిధిలో ఆళ్ల బాలయ్య, 23వ వార్డులో గజ్జుల సునీత, 18వ వార్డులో షేక్ చాంద్‌బాష కుటుంబాలను ఆయన పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల వంతున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకరరెడ్డి, బిజెపి పట్టణ మాజీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి జనసేన చేయూత

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ పీవోసీ కొట్టె వెంకటేశ్వర్లు

సీతారామపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సోంపల్లి గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త సురేష్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఈ విషయాన్ని ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ పిఓసి కొట్టే వెంకటేశ్వర్లు తెలుసుకొని బుధవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఆల్లూరి రవీంద్ర, మండల కన్వీనర్ పాలిశెట్టి శ్రీనివాసులు, ఉదయగిరి మండల కన్వీనర్ కల్లూరి సురేంద్రరెడ్డి, వీర మహిళ సరిత, భాస్కర్, రమేష్, కిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు ఉప సర్పంచిగా గున్నం సుశీల

గున్నం సుశీలకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

వింజమూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వింజమూరు మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మిడదాల జయలక్ష్మీ ఇటీవల వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా పంచాయతీరాజ్ ఏఈ తిరుమలయ్య వ్యవహరించారు. వింజమూరు పంచాయతీలోని 20 పంచాయతీలకు గాను 4, 17 వార్డుల సభ్యులు గైర్హాజరయ్యారు. 11వ వార్డు సభ్యురాలు గున్నం సుశీల ఉపసర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేశారు. మిగిలినవారెవ్వరూ నామినేషన్ వేయకపోవడంతో ఆమెను రిటర్నింగ్ అధికారి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాసులు, సర్పంచ్ సృజన, పంచాయతీ కార్యదర్శి రామారావు, రిటర్నింగ్ అధికారి తిరుమలయ్యల సమక్షంలో ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అధికారులు ఉపసర్పంచ్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా గున్నం సుశీల మాట్లాడుతూ తనను ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్న వార్డు సభ్యులకు, సర్పంచ్ సృజన, గ్రామ ప్రజలు, నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే సురేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మద్దూరు రాజగోపాల్‌రెడ్డి, భీమరెడ్డి రామిరెడ్డి, వనిపెంట సుబ్బారెడ్డి, యల్లాల రఘురామిరెడ్డి, కోడూరు నాగిరెడ్డి, తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోను కొనసాగించాలని వినతి

తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు.

కలువాయి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తోపుగుంట వీఆర్వో అరుణను కొనసాగించాలని బుధవారం రెవెన్యూ పరిధిలోని తోపుగుంట, అగ్రహారం, బాలాజీరావుపేట గ్రామస్థులు తహసీల్దారు శ్యామ్ సుందర్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న ఆమెను మరో చోటకు బదిలీచేసి కొత్తవారిని నియమించారని, బదిలీని రద్దుచేసి అరుణను ఇక్కడే కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని వారు తహసీల్దారును కోరారు.

పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీలపై ఆడిట్

రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ బృందసభ్యులు

సీతారామపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీలపై స్థానిక వెలుగు డీఆర్‌డీఏ కార్యాలయంలో బుధవారం ఆడిట్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆడిట్ బృంద సభ్యులు మాట్లాడుతూ 2024 ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి 31వరకు పొదుపు సంఘాలలో జరిగిన బ్యాంకు లావాదేవీలు, వసూళ్లు, చెల్లింపులు, ఆస్తులు, తీసుకున్న రుణాల నగదు వివరాల రికార్డులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామన్నారు.

సీహెచ్‌సీ తనిఖీ

వింజమూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంగళవారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. నైట్ డ్యూటీలో ఉన్న డాక్టర్ శ్వేతతో కలిసి ఆయన ఆసుపత్రిలోని డయాలసిస్ వార్డు, జనరల్ వార్డులను పరిశీలించి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, కార్యాలయం సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



దర్గాబాబు (ఫైల్)

కావలి రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పేపాల దర్గాబాబు(62) మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య హైమావతి బుధవారం కావలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని సిరిపురంకు చెందిన దర్గాబాబు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి స్నానం చేసిన తరువాత ఇంటి ముందు ఇనుప రేకుల కింద ఇనుప పైపుకు కట్టిన తీగపై తడిచిన డ్రాయర్ వేయగా విద్యుత్ షాక్ తగిలి కేకలు వేస్తూ కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని బట్టలు ఆరేసుకునే తీగను పరిశీలించగా ఇంటికి విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ పైపు దెబ్బతిని రేకుల కింద పైపునకు తగిలి ఉండటంతో విద్యుదాఘాతానికి గురైనట్లు గుర్తించారు. రూరల్ ఎస్ఐ బాజీబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారైలు ఉన్నారు. దర్గాబాబు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇరువర్గాల ఘర్షణ : పలువురికి గాయాలు

● పిడతాపోలూరు వడ్డిపాలెంలో ఉద్రిక్తత

దాడుల్లో ధ్వంసమైన వాహనాలు

ముత్తుకూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడతాపోలూరు పంచాయతీ కట్టకింద వడ్డిపాలెంలో బుధవారం రెండువర్గాల ఘర్షణ ఉద్రిక్తతకు దారి తీసింది. దాడుల సమాచారం అందుకున్న కృష్ణపట్నం సీఐ రవినాయక్, ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. బాధితుల కథనం మేరకు, పాత గొడవలు మనసులో పెట్టుకుని గ్రామంలో ఒక వర్గం రెండో వర్గానికి చెందిన వారి ఇళ్లపై దాడులు చేశారు. దాడుల్లో ఆరుగురికి తీవ్రగాయాలు కాగా మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. రాము వర్గీయుల ఇళ్లలో ఉండగానే నెల్లూరు రవి వర్గానికి చెందిన వారు రాళ్లు, కర్రలు, రాడ్లతో తమపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తమను చంపేస్తామంటూ బెదిరించారన్నారు. పోలీసులు రావడంతో దాడి చేసిన వారు పరారయ్యారు. ఈ దాడుల్లో పది ఇళ్లలో పరికరాలు, ఆటోలు, మోటారు సైకిళ్లు ధ్వంసమయ్యాయి. గతంలో వైసీపీలో ఉన్నవారు టీడీపీలో చేరారని, ప్రస్తుతం జరిగిన దాడులు ఈ రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్నాయని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు స్థానిక నాయకులతో చర్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

బాధితులను విచారిస్తున్న సీఐ రవినాయక్

ఎరువుల దుకాణాల్లో విజి‘లెన్స్’!

ఉదయగిరి : ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి/కలిగిరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై బుధవారం సెంట్రల్ స్క్వాడ్, విజిలెన్స్ అధికారులు వ్యవసాయ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. వినుకొండ ఏడీఏ సీహెచ్ రవికుమార్, ఒంగోలు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్ రాఘవరావులు ఉదయగిరిలోని పలు దుకాణాల్లో ఎరువులు, పురుగు మందుల క్రయ, విక్రయాల రికార్డులు, ఇన్‌వాయిస్ బిల్లులు, గోదాముల్లో నిల్వలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం శ్రీబాలాజీ ఫర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ దుకాణంలో రూ.12 7,64,437, శ్రీనరహరి ఫర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ దుకాణంలో రూ.4 9,18,159 విలువైన పురుగుమందులకు స్టాకు రిజిస్టర్, కంప్యూటర్ ఫార్మెట్‌లో ఎలాంటి సమాచారం లేనందున అమ్మకాలు నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేశారు. అలాగే కలిగిరిలో బిల్లులులేని 41.85 మెట్రిక్ టన్నులు ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. నకిలీ పురుగుమందులు, విత్తనాలు, విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు. కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, పీ చెన్నారెడ్డి, ఉదయగిరి, కలిగిరి వ్యవసాయాధికారులు విజయభాస్కర్, జహీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వైద్యశాలలో విద్యార్థి మృతి

● ఘటనపై పలు అనుమానాలు

● మృతుడు సత్యసాయి జిల్లావాసి

నెల్లూరు(క్రైం), జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాల మెడికల్ షాపులో పనిచేస్తున్న ఫార్మసీ విద్యార్థి బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఆ యువకుడి మృతిపై స్నేహితులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సేకరించిన సమాచారం మేరకు.. సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన శ్రీకాంత్ నెల్లూరులోని సనా కళాశాలలో డీ ఫార్మసీ చదువుకుంటూ నగరం లోని మద్రాసు బస్టాండు సమీపంలో ఉన్న పెంచలయ్య వైద్యశాల లోని మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం వైద్యశాలకు వచ్చిన శ్రీకాంత్ మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి సిబ్బంది చికిత్స నిమిత్తం జయభారత్ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు సీరియస్‌గా ఉందని వెంటనే జీజీహెచ్‌కు తరలించాలని సూచించడంతో అక్కడకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీకాంత్ మృతి చెందాడు.

● మృతిపై అనుమానాలు

విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు జీజీహెచ్‌కు చేరుకుని శ్రీకాంత్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. వైద్యశాలలో పనిచేసే నర్సులు ఫిట్స్ వచ్చిందని చెబుతున్నారని, మరి కొందరు కరెంట్ షాక్ తగిలిందని చెప్పారని, అయితే వైద్యశాల యాజమాన్యం మాత్రం గుండెపోటు వచ్చిందని చెప్పడం అనుమానాస్పదంగా ఉందన్నారు. విద్యార్థి సమాచారం అందుకున్న చిన్నబజారు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు వారు శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	116
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 515

వైసీపీ నేతలకు అభివృద్ధి కనిపించడం లేదా? : టీడీపీ

బిట్రగుంట, జూలై 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలన ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి వైసీపీ నేతలకు కనిపించ లేదంటే పచ్చ కామేర్ల కంటికి లోకమంతా పచ్చగ కనిపించినట్లు ఉందని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు అన్నారు. బోగోలు టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతు కక్షసాధింపులు, అక్రమ కేసులు నమోదు చేయించడం వైసీపీ నేతలకు అలవాటే అన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధితో పాటు స్థానిక సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిలకపాటి వెంకటేశ్వర్లు, కోడూరు వెంకటేశ్వరరెడ్డి, కాంద్ర రఘురాం నాయుడు, యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, కోటా వెంకారెడ్డి, వై.వెంకటేశ్వర్లు రెడ్డి, ఏ.ఆదిశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

వంతెనల వద్ద దెబ్బతిన్న రోడ్లు!

● రక్షణ గోడలు కరువు ● పొంచి ఉన్న ప్రమాదాలు ● ఆందోళనలో వాహన చోదకులు ● పట్టించుకోని అధికారులు

కలిగిరి-కొండాపురం మార్గంలో వంతెనపై దెబ్బతిన్న రోడ్డు, రక్షణ గోడలు లేని వంతెన

కలిగిరి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో రహదారులలో ఉన్న వంతెనల వద్ద రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. కలిగిరి-కొండాపురం, కలిగిరి-సంగం, 14వమైలు-సిద్ధనకొండూరు, పాతనాపురం-అనంతపురం మార్గాలలో వంతెనలు పురాతనమైనవి కావడంతో రోడ్డు మధ్యలో సిమెంటు లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. పలు వంతెనల వద్ద రెండు వైపులా రక్షణ దిమ్మెలు లేకపోవడంతో వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెనలపై మధ్యలో రోడ్డు దెబ్బతినడం ఓ అంచున ప్రయాణాలు చేసేటప్పుడు అదుపుతప్పి పడితే ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ప్రధాన రహదారుల్లో గుంతలకు ప్యాచ్ వర్క్‌లు వేస్తున్నారని, అదేవిధంగా బ్రిడ్జిల వద్ద దెబ్బతిన్న రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు వేయడంతోపాటు రక్షణ దిమ్మెలను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

● కల్వర్టు నిర్మాణాల వద్ద కానరాని సూచిక బోర్డులు

రహదారి విస్తరణ కార్యక్రమంలో భాగంగా కలిగిరి-కొండాపురం రహదారి రెండు లేన్ల రహదారిగా విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో పలుచోట్ల వంతెన నిర్మాణాలను పునర్నిర్మిస్తున్నారు. అయితే వంతెన నిర్మాణాల వద్ద డైవర్షన్ రోడ్డు, వర్క్‌ఇన్ ప్రోగ్రెస్, గోస్లో వంటి కనీస సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ముఖ్యంగా ఈ మార్గంలో కృష్ణారెడ్డిపాలెం సమీపంలో రెండు కల్వర్టు నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతం వద్ద ప్రమాదకర మలుపులు ఉన్నాయి. కాంట్రాక్టర్లు కల్వర్టు నిర్మించే ప్రదేశంలో రోడ్డుకు అడ్డుగా మట్టికట్టలు వేసి పనులు సాగిస్తున్నారు. కేవలం మట్టిని అడ్డుకట్టగా వేసి ఉండటంతో రాత్రివేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్వర్టు నిర్మాణం వద్ద అప్రోచ్ రోడ్ గుర్తించలేక ఎదురుగా రహదారిపై రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టికట్టల వద్దకు వాహనాలను తీసుకెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ మార్గంలో ఎక్కువశాతం రాత్రివేళల్లో రైతులు పొగాకు చెక్కులను ట్రాక్టర్ల ద్వారా కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రానికి తీసుకువస్తారు. దీనికితోడు ఈ మార్గం ద్వారా మాలకొండ పుణ్యక్షేత్రానికి దూర ప్రాంతాల నుంచి వివిధ వాహనాల్లో భక్తులు వెళుతుంటారు. అదేవిధంగా ఈ దారిగుండా కందుకూరు వయా హైదరాబాద్‌కు ఎక్కువశాతం ప్రయాణిస్తూ ఉంటారు. రోడ్డు పనులు చేసే ప్రదేశాలలో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రమాదాలకు గురికాకుండా క్షేమంగా గమ్యాలకు చేరుకుంటామని వాహనదారులు అంటున్నారు.

కృష్ణారెడ్డిపాలెం కల్వర్టు నిర్మాణం వద్ద రోడ్డుకు అడ్డగా మట్టికట్ట

మున్సిపల్ కార్మికుల ధర్నా

మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కావలి(టౌన్), జూలై 16(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి వై కృష్ణమోహన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజన్సీలకు అప్పజెప్పే ఆలోచన మానుకోవాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వయస్సు పరిమితిని 62 ఏళ్లకు పెంచాలని, ఎక్స్‌గ్రేషియా పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగించాలి కోరారు. ఇంజనీరింగ్ కార్మికులకు చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య, నాయకులు మధుసూదన్‌రావు, తురకా శీనయ్య, బి మహేష్, ఒంగోలు మహేష్, ఏసుదాసు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలి

● ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

ఉలవపాడు, జూలై 16(ఆంధ్రజ్యోతి) : కరేడులో భూసేకరణకు ఇచ్చిన జీవోను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కందుకూరు వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, పార్టీ నాయకులతో కలిసి కరేడులో ఆయన పర్యటించి రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బస్‌స్టాండ్ సెంటర్‌లో గ్రామస్థులతో సమావేశమయ్యారు. గత వైసీపీ ప్రభుత్వం ఇండోసోల్ పరిశ్రమకు భూముల ఎక్కడ కేటాయించారో అక్కడే యథావిధిగా ఇవ్వాలని, కరేడు వంటి ఆహ్లాదకరమైన ప్రాంతం, సారవంతమైన భూములను లాక్కోవాలనుకోవడం ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమేనని విమర్శించారు. అదేవిధంగా భూసేకరణను వ్యతిరేకిస్తున్న గ్రామస్థులకు, రైతులకు సంఘీభావంగా మానవ హక్కుల వేదిక, రాష్ట్ర చేనేత జన సమాఖ్య కార్యకర్తలు కరేడు గ్రామంలో పర్యటించి మద్దతు ప్రకటించారు. అదేవిధంగా గిరిజన, మత్స్యకారుల కాలనీలలో డాక్టర్లు, కవులు, కళాకారులు, మత్స్యకారుల సంఘం నాయకులు పర్యటించి భూసేకరణ వ్యతిరేక పోరాటానికి సంఘీభావం తెలిపారు.

మధ్యవర్తిత్వం సద్వినియోగం చేసుకోవాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభ

న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

కందుకూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి) : సివిల్, క్రిమినల్ కేసుల్లో రాజీ పడదగిన వివాదాలపై కక్షిదారులు మధ్యవర్తిత్వం, లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ అన్నారు. బుధవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణం నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏపీజీబీలో రూ.65 కోట్లు దాటిన వ్యాపారం

● మేనేజర్ సురేష్ కుమార్

వలేటివారిపాలెం, జూలై 16(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ గత నెల 30వ తేదీకి రూ.65 కోట్ల వ్యాపారం దాటిందని ఆ బ్యాంకు మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని పోలినేనిపాలెంలో బుధవారం ప్రధానమంత్రి జన సురక్ష యోజన పథకం కార్యక్రమంపై ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో మేనేజర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది మే నెల నుంచి ఏపీజీబీ రాష్ట్ర వ్యాప్తంగా సేవలు అందిస్తునట్లు తెలిపారు. అన్ని వర్గాలకు వివిధ రకాల రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అన్ని బ్యాంకుల కంటే ఏపీజీబీలో డిపాజిట్‌లకు అధిక వడ్డీ చెల్లించనున్నట్లు చెప్పారు. ఖతాదారులు బీమా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రవికుమార్, గ్రామస్థులు మాదాల రమణయ్య, మానికొండ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే కార్యక్రమంపై అవగాహన ర్యాలీ

నమస్తే దినోత్సవం ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది

అల్లూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కటిక పేదల కోసం ప్రవేశపెట్టిన నమస్తే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని వారి జీవితాల్లో ఉజ్వల జ్యోతిని నింపుకోవాలని నవజీవన్ ఆర్గనైజేషన్ స్టేట్ కోఆర్డినేటర్ ఐ.మారుతి ప్రసాద్ అన్నారు. అల్లూరులో కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్, మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ డెవలప్‌మెంట్, మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ సంయుక్తంగా బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ కోఆర్డినేటర్లు అబ్దుల్ అలీమ్, షేక్ ఖాదర్‌బీ, డాక్టర్ చేవూరు చిన్న, వినయ్ కుమార్, సర్వేయర్లు షేక్ సుభాని బాష, మైనంపాటి చంద్రిక, గుణ్ణం శ్రీలేఖ, తుపాకుల గాయత్రి, చేవూరు శిరీష పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పోకూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

వలేటివారిపాలెం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని టీడీపీ నాయకులు సోమినేని తిరుమలరావు తెలిపారు. మండలంలోని పోకూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారంతో నూరుశాతం పూర్తయింది. టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బత్తిన వెంకటేశ్వర్లు, లింగాబత్తిన మాల్యాద్రి, యెరిచర్ల దేవ కుమార్, ఆలూరి రాములు, గుర్రం మంగయ్య, పులి రవి పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు ఆర్యవైశ్యుల కృతజ్ఞతలు

కందుకూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక ఉద్యాన వనానికి అమరావతిలో 6.8 ఎకరాల భూమిని కేటాయించినందుకు కందుకూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

కావలి అభివృద్ధి ప్రణాళిక రూపొందించండి

● స్వర్ణాంధ్ర-2047 విజన్ సమీక్షలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, పక్కన ఆర్డీవో, తదితరులు

కావలి, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా కావలి నియోజకవర్గంలో ఉన్న వనరులు, పరిస్థితులకు అనుకూలంగా ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికపై ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణతో కలసి డివిజన్, మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యాలను గురించి వివరించి అందుకు అనుగుణంగా శాఖల వారీగా అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు తయారు చేస్తున్నారో సంబంధిత అధికారులను ఆర్డీవో ప్రశ్నించారు. దీనిపై వారు తమ శాఖలలో ఉన్న వనరులకు అనుకూలంగా ఎలాంటి ప్రణాళికలు తయారు చేయగలమో వివరించారు. ఒకవేళ విజన్ విధి విధానలు మారితే వాటిని కూడా అధికారులకు వాట్సాప్ ద్వారా తెలయచేస్తామని, వాటికి అనుకూలంగా ప్రణాళికలు ఉండాలని ఆర్డీవో చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని బంగారు కుటుంబం చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడుగులు వేయిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో దారిద్ర్య రేఖకు దిగువన 9,000 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించామని, వారి అభ్యున్నతికి చర్యలు చేపడుతామన్నారు. వారిని పీ-4 పథకం ద్వారా ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాల నుంచి బయటకు వెళ్లి ఉన్నత స్థాయిలో ఉన్న వారిని గుర్తించేందుకు పంచాయతీ కార్యదర్శులు సర్వే చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పీ.శ్రాణ్‌కుమార్, ఎంపీడీవో సీహెచ్.శ్రీదేవి, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు అన్నిశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కరేడుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలి

● ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

కందుకూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి) : ఏటా మూడు పంటలు పండే పచ్చని భూముల కోసం కరేడు రైతుల ఆందోళనపై రాష్ట్రప్రభుత్వం వాస్తవ పరిస్థితులను తెలుసుకొని పునరాలోచన చేయాలని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కోరారు. బుధవారం సాయంత్రం కందుకూరులో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ భూసేకరణకు వ్యతిరేకంగా కరేడులో గడపగడప రగిలిపోతుందన్నారు. ప్రభుత్వం బలవంతపు భూసేకరణతో ముందుకెళితే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కరేడు పరిధిలో రమారమి 6000 కుటుంబాలు జీవిస్తుండగా అందులో మూడింట రెండువంతులు కుటుంబాలు భూమిలేని నిరుపేదలు కాగా, కూలి పనులు, పశుపోషణ, కౌలు రైతులుగా జీవిస్తున్నారని, భూమి కలిగిన ఒకవంతు కుటుంబాల్లో కూడా 90 శాతం సన్నా చిన్న కారు రైతులని తెలిపారు. ప్రస్తుతం అక్కడ భూసేకరణ చేస్తే సుమారు 20,000 మంది జీవనభృతి కోల్పోతారని, ఒక పరిశ్రమ కోసం ఇన్ని వేల కుటుంబాలను రోడ్డున పడేయడం ధర్మం కాదన్నారు. కరేడులో 8,364 ఎకరాలకు నోటిఫికేషన్ ఇచ్చి ప్రస్తుతం కరేడు పరిధిలోని 4 గ్రామాలకు మినహాయింపు ఇస్తామని ఎమ్మెల్యే మాట్లాడుతున్నారంటే మిగిలిన గ్రామల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కరేడులోకి వెళ్లాలంటే భారీ పోలీసు బందోబస్తు లేనిదే వెళ్లలేకపోతున్నారంటే అక్కడ రైతులు ఎంత ఆగ్రహంగా ఉన్నారో అర్థమవుతుందన్నారు. ఇండోసోల్ పరిశ్రమను తొలుత వారికి కేటాయించిన చేవూరు, రావూరు గ్రామల పరిధిలోనే ఏర్పాటు చేయాలని హితవు పలికారు. ప్రభుత్వం బలవంతపు భూసేకరణకు సిద్ధపడితే రైతులకు మద్దతుగా అన్ని ప్రజా సంఘాలతో కలిసి పోరాడతామని ఒక్క సెంటు భూమి కూడా భూసేకరణకు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు.

మహిళలంటే జగన్‌రెడ్డికి చులకన భావం

● ప్రసన్నను సమర్థించడంపై టీడీపీ నేతల ఆగ్రహం

మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు

కావలి, జూలై 16(ఆంధ్రజ్యోతి): కోవూరు మహిళా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని అసభ్యపదజాలంతో దూషించిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిపై రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, మహిళాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి వెనుకేసుకురావడం మహిళల పట్ల ఆయనకు ఉన్న చులకన భావం బహిర్గతమైందని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు మాట్లాడుతూ సోదరి వరుసయ్యే ఒక మహిళను వ్యక్తిత్వహననం చేసేలా సభ్యసమాజం తలదించుకునేలా వాఖ్యలు చేసి నేటికీ క్షమాపణ చెప్పకపోవటం, జగన్మోహన్‌రెడ్డి ఖండించకపోవడం హాస్యాస్పదమన్నారు. ఆయన వాఖ్యలను హైకోర్టు తప్పు పట్టినా జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నేతలు స్పందించకపోవడం దారుణమన్నారు. కోవూరు నియోజకవర్గంలో వైసీపీ జెండా పట్టుకోవడానికి కార్యకర్తలు కరువయ్యారని, ఈ పరిస్థితుల్లో జగన్ మెప్పుకోసం మహిళా ఎమ్మెల్యేను కించపరుస్తూ ప్రసన్నకుమార్‌రెడ్డి వాఖ్యలు చేసారన్నారు. అమరావతి మహిళలను సంకరజాతి అని సజ్జల, వేశ్యలని మరొకనేత నిస్సిగ్గుగా అవమానించినా జగన్మోహన్‌రెడ్డి వారిని సమర్థించటం హేయమన్నారు. జగన్మోహన్‌రెడ్డి వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు అర్షియా బేగం, టీడీపీ నేతలు తిరువీధి ప్రసాద్, ఖమర్‌బాబు, పలువరు మహిళలు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

పెంట్రాలలో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

లింగసముద్రం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాల యూపీ పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ఎం శ్రీనివాసులు, కల్లగుంట మోహన్‌రావు, ఏ శ్రీనివాసాచారి, కె వెంకటేశ్వర్లును బుధవారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయిని ఎస్ హైమావతి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు విద్యార్థులకు భోజనం, స్వీట్లు ఏర్పాటు చేయడంతో పాటు వంట మహిళలకు, శానిటరీ వర్కర్‌కు చీరలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కొండలరావు, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సంధ్యారాణి, కరుణ, నాగశ్రీ, విజయకుమారి, సుబ్రహ్మణ్యం, పూర్వ విద్యార్థి కల్కేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తమ్మిశెట్టి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

బిట్రగుంట, జూలై 16(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు సంఘానికి చెందిన గిరిజన జేఏసీ నేత తమ్మిశెట్టి హరిబాబు సోదరుడు తమ్మిశెట్టి యోహాను (40) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన వెంట సిద్ధు నాగేశ్వరరావు, వెంకయ్య, బి.ప్రభాకర్, మనోహర్, యు.రవి, తదితరులు ఉన్నారు. అదే విధంగా ఏపీ రాష్ట్ర గిరిజన జేఏసీ నేత సముద్రాల దావీదు, దివ్యాంగుల సంఘనాయకులు తుమ్మా మస్తాన్, దళిత నేత సుధాకర్ తదితరులు తమ్మిశెట్టి కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు.

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేయాలి

రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో-2 ఆనందరావు

కొండాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్ర వివరాలను ఆన్‌లైన్లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఎంఈవో-2 ఆనందరావు పేర్కొన్నారు. బుధవారం శెట్టిపాలెం పంచాయతీలోని తూర్పుజంగాలపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థులందరి సమగ్ర వివరాలను రికార్డులతోపాటు ఆన్‌లైన్లో నమోదుచేయాలని ప్రదానోపాధ్యాయిని రమీజ్‌బేగంకు సూచించారు. విద్యార్థుల అభ్యసనతోపాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు.

నెల్లూరులో జీవిత ఖైదీ పరార్!

● ముమ్మరంగా గాలిస్తున్న పోలీస్ బృందాలు

వెంకటాచలం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఓ హత్య కేసులో జీవిత శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి మంగళవారం పరారయ్యాడు. వెంటనే అప్రమత్తమైన జైలు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముమ్మరంగా గాలిస్తున్నారు. సంగం మండలం గాంధీజన సంఘానికి చెందిన ఇండ్ల సురేష్ ఓ హత్య కేసులో 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. కొన్నేళ్లుగా నెల్లూరు సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. సత్ప్రవర్తన కింద సురేష్ సుమారు మూడేళ్ల నుంచి ఓపెన్ జైలులోని వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తున్నాడు. అయితే, మూడు రోజుల కిందట సురేష్‌ను చూసేందుకు కుటుంబ సభ్యులు రావడంతో వారిని చూసి ఎమోషనల్‌కు గురైనట్లు సమాచారం. ఈక్రమంలో సురేష్ తన దినచర్యలో భాగంగా ఓపెన్ జైలులో వ్యవసాయ పనులు చేస్తూ మంగళవారం సాయంత్రం అదృశ్యమయ్యాడు. జైలు అధికారులు ఖైదీలను లెక్కించే క్రమంలో సురేష్ రాలేదని గమనించారు. ఆ తర్వాత ఓపెన్ జైలులో పరిశీలించగా సురేష్ పరారైనట్లుగా గుర్తించి, వెంటనే జైలు ఉన్నతాధికారులతోపాటు అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించారు. వెంకటాచలం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. సంగం మండలంలోని గాంధీజన సంఘంతోపాటు బంధువుల ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో సురేష్ ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. కాగా సత్ప్రవర్తనలో భాగంగా సురేష్ త్వరలో జైలు నుంచి విడుదల కావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. కానీ ఇంతలో జైలు నుంచి కనిపించకుండా పరారయ్యాడు.

కండలేరు నీటి మట్టం 29.707 టీఎంసీలు

రాపూరు, (ఆంధ్రజ్యోతి): కండలేరు పూర్తి స్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 29.707 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్టా తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

యాంత్రిక పారిశుధ్య వ్యవస్థపై అవగాహన ర్యాలీ

కావలి, జూలై 16(ఆంధ్రజ్యోతి): యాంత్రిక పారిశుధ్య వ్యవస్థపై అవగాహన కల్పిస్తూ బుధవారం కావలిలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మురుగు కాలువలు, సెప్టిక్ ట్యాంకులు, భూగర్భ డ్రైనేజీలను యాంత్రిక విధానంతోనే చేయాలన్నారు. అలాగే పారిశుధ్య పనుల నిర్వహణలో కార్మికులు అవసరమైన పరికరాలను ఉపయోగించుకుంటూ ఆరోగ్య పరమైన పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు వెళ్లి తిరిగి మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బషీర్, నాగేశ్వరరావు , సచివాలయ కార్యదర్శులు, నవజీవన్ ఆర్గనైజేషన్ కో-ఆర్డినేటర్స్, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు, కార్మికులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 17 జూలై 2025



తిరుపతిలో బుధవారం సాయంత్రం వానొచ్చింది. నగరంలోని రోడ్లపైకి నీళ్లు చేరాయి. మరో వైపు శేషాచల కొండల్లో కురిసిన వర్షంతో.. రాళ్లు రప్పలు దాటుకుంటూ జలజలమంటూ కపిలతీర్థంలోకి నీళ్లు దూకుతున్నాయి.

ఆయువు పోసే ఆలయం

భూమ్మీద పడింది. కళ్లు తెరవకనే గుండెకు చిల్లు. పేద అమ్మానాన్నల గుండెల్లో కలవరం. ఏం చేయాలో పాలుపోని వైనం. తిరుపతిలో ఫ్రీగా చికిత్స చేస్తారనే తీయని మాట చెవిన పడింది. క్షణం ఆలస్యం చేయకుండా చేరుకున్నారు. 48గంటల్లోనే ఆపరేషన్ పూర్తయింది. పసికందు కోలుకుంది. తల్లడిల్లిన తల్లిదండ్రుల గుండెనిండా పట్టరాని ఆనందం విరిసింది. ఇలాంటి వైనాలెన్నింటికో కేంద్రంగా నిలుస్తోంది పద్మావతి హార్ట్ సెంటర్ (హృదయాలయం).

- వివరాలు 8లో -

నేడు ఢిల్లీలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు ప్రదానం

తిరుపతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలకసంస్థకు స్వచ్ఛ సర్వేక్షణ్-2024 అవార్డును గురువారం కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్రదానం చేయనుంది. కేంద్ర హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ చేతుల మీదుగా ఈ అవార్డును మేయర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య అందుకోనున్నారు. దీనికోసం వీరిద్దరూ బుధవారం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.

హౌసింగ్ శాఖలో అవినీతి

- ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై క్రిమినల్ కేసుకు సిఫార్సు

వరదయ్యపాళెం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం హౌసింగ్ శాఖలో అవినీతి అక్రమాలకు పాల్పడిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ కార్తీక్‌పై క్రిమినల్ కేసు నమోదుకు సిఫార్సు చేస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందిరానగర్ సచివాలయ పరిధిలో 2021-24 మధ్య గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన 53 ఇళ్లకు బిల్లుల చెల్లింపులో అక్రమాలు చోటు చేసుకున్నాయని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఆశా సమాచార హక్కు చట్టం ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన కలెక్టర్.. అవినీతిని నిర్ధారిస్తూ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కార్తీక్‌పై క్రిమినల్ కేసు నమోదుతో పాటు రూ.13,75,891 రికవరీ చేయాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై అప్పట్లో ఒత్తిడి తెచ్చి అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అధికారులు మరింత లోతైన విచారణ జరిపితే తమ పేర్లు ఎక్కడ బయటకు వస్తాయోనన్న ఆందోళనలో ఉన్నారు.

‘పల్లం’పై పెద్దల కన్ను

- సీజేఎఫ్ఎస్ భూముల కొనుగోలు ముసుగులో ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

అటు పారిశ్రామికం. ఇటు విద్యాకేంద్రం. ఈ రెండు రంగాల్లో ఏర్పేడు మండలం ముందుంది. దీంతో భూముల రేట్లు పెరిగాయి. ఇక్కడే కొందరు పెద్దలు.. ప్రభుత్వ భూములపై కన్నేశారు. అలా వీరి చూపు ‘పల్లం’లోని అంధనాల గుంతపై పడింది.

- ఏర్పేడు, ఆంధ్రజ్యోతి

సీజేఎఫ్ఎస్ భూముల పక్కన చదును చేసిన ప్రభుత్వ భూమి

ఏర్పేడు మండలం పల్లం రెవెన్యూ పరిధిలో గత ప్రభుత్వంలో టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాల పంపిణీ పేరిట 500 ఎకరాల్లో ఇప్పటికే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. డీఆర్‌డీఏకు 50 ఎకరాలు కేటాయించారు. ప్రస్తుతం ఆ భూముల్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో పల్లం రెవెన్యూలో భూములకు గిరాకీ ఏర్పడింది. డీఆర్‌డీఏకి ఇచ్చిన 50 ఎకరాలకు ఎదురుగా ఏర్పేడు- వెంకటగిరి రహదారిని ఆనుకుని సర్వే నెంబరు 305లో 29 ఎకరాల అంధనాల గుంత ఉంది. ఈ గుంత చుట్టూ పల్లం దళితవాడకు చెందిన 75మంది రైతులకు 18 ఎకరాలను 1974లో సీజేఎఫ్ఎస్ కింద ప్రభుత్వం అందించింది. దళితుల వద్ద ఉన్న సీజేఎఫ్ఎస్ భూములను కొనుగోలు చేసి, దాని పక్కనే ఉన్న అంధనాల గుంతను కబ్జా చేయడానికి కొందరు పెద్దలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ భూమిని తమ పేర్లతో మార్చుకోవడానికి కొంతమంది, తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి మరికొందరు చర్యలు చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారికి ఆనుకుని ప్రభుత్వ భూముల్లో పదిరోజులుగా చెట్లను తొలగించి చదును చేస్తున్నారు. సీజేఎఫ్ఎస్ భూముల కొనుగోలు ముసుగులో భూములను చదును చేస్తుంటే రెవెన్యూశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. కబ్జాకు ప్రయత్నం చేస్తున్న భూమి విలువ రూ.కోట్లలో ఉంది. కాగా, పల్లం రెవెన్యూలో ప్రభుత్వ భూములను అధికారులు కాపాడకపోతే, భవిష్యత్తులో స్థానిక.. ప్రభుత్వ అవసరాలకు సెంటు ప్రభుత్వ భూమి కూడా మిగలదు.

విచారించి చర్యలు తీసుకుంటాం

ఈ ప్రాంతంలో దశాబ్దాల కిందట పల్లం దళితవాడకు చెందిన కొందరికి సీజేఎఫ్ఎస్ కింద పట్టాలు ఇచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించాం. అయితే పూర్తిస్థాయిలో విచారించి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం.

- భార్గవి, తహసీల్దారు

19న తిరుపతికి సీఎం రాక

- కపిలతీర్థంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రకు హాజరు
- పరేడ్ మైదానంలో పీ4 మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో ముఖాముఖి
- నేడు ఖరారు కానున్న పర్యటన షెడ్యూలు

తిరుపతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 19వ తేదీన తిరుపతి రానున్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏదో ఒక జిల్లాలో సీఎం పాల్గొనడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ శనివారం తిరుపతిలో పర్యటించనున్నారు. భక్తులతో కలసి కపిలేశ్వరాలయ ఆవరణను, పుష్కరిణిని శుభ్రపరచనున్నారు. అనంతరం పోలీస్ పరేడ్ మైదానానికి చేరుకుని పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులను, బంగారు కుటుంబాలను కలుసుకుంటారు.



మార్గదర్శులుగా ముందుకొచ్చిన హోటల్ తాజ్, హోటల్ పాయ్ వైస్రాయ్, రాస్, రోటరీ క్లబ్, అమరరాజా సంస్థల ప్రతినిధులతో పాటు ఆ సంస్థలు దత్తత తీసుకునే బంగారు కుటుంబాల్లో ఎంపిక చేసిన పది కుటుంబాలతో సీఎం చంద్రబాబు ముఖాముఖీ సమావేశం కానున్నారు. ఈ ఈ కార్యక్రమాలతో పాటు ఒకట్రెండు అదనపు కార్యక్రమాలు కూడా సీఎం పర్యటన షెడ్యూలులో చేరనున్నట్టు సమాచారం.గురువారం అధికారికంగా పర్యటన ఖరారయ్యే అవకాశముంది. కాగా, సీఎం చంద్రబాబు తిరుపతిలో పర్యటించనున్న ప్రదేశాలను బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధనరాజు, సీఎం భద్రతా విభాగం అధికారులు పరిశీలించారు.

శ్రీకాళహస్తి పూర్వ పీఆర్ ఏఈపై

విచారణాధికారి మార్పు

తిరుపతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఇది వరకూ పనిచేసిన పంచాయతీరాజ్ ఏఈ ఈశ్వర్ బాబుపై విచారణాధికారిని మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన గతంలో శ్రీకాళహస్తిలో పనిచేస్తూండిన సమయంలో మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో గ్రావెల్ రోడ్ల నిర్మాణ వ్యవహారంలో అక్రమాలు జరిగాయి. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో ఈశ్వర్ బాబుపై 2013లో శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. అప్పట్లో తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న టి.సకలారెడ్డిని విచారణాధికారిగా ప్రభుత్వం నియమించింది. ఆయన బదిలీపై వెళ్లడంతో.. ఆ స్థానంలో 2020లో తిరుపతి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన చంద్రమౌళీశ్వర్‌రెడ్డిని విచారణాధికారిగా ప్రభుత్వం నియమించింది. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల సందర్భంగా అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు రావడంతో ఆయన ప్రస్తుతం సస్పెన్షన్‌లో వున్నారు. దీంతో తాజాగా తిరుపతి ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ ఎన్.అమరయ్యను విచారణాధికారిగా నియమిస్తూ బుధవారం మున్సిపల్ పాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలల వ్యవధిలో విచారణ ముగించి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈశ్వర్ బాబుపై విచారణకు సంబంధించిన రికార్డులను వెంటనే విచారణాధికారికి అందజేయాలని మున్సిపల్ పాలనా శాఖ డైరెక్టర్‌ను ముఖ్య కార్యదర్శి ఆదేశించారు.

‘కలర్స్’ ట్రేడింగ్ యాప్ పేరిట

రూ.ఆరు లక్షల మోసం

తిరుపతి(నేరవిభాగం), జూలై 16(ఆంధ్రజ్యోతి): ‘కలర్స్ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టండి. అధిక లాభాలు పొందండి’ అంటూ సైబర్ నేరగాళ్ల నమ్మించి.. మోసం చేశారు. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. కెనడీనగర్‌కు చెందిన రూపకుమార్ సెల్‌ఫోనుకు గుర్తు తెలియని వ్యక్తులు కలర్స్ ట్రేడింగ్ యాప్‌ను పంపారు. ఈ యాప్‌లో తక్కువగా పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మబలికారు. రూ 50,000 పెట్టుబడి పెట్టి చూడు నీ అకౌంటుకు కనీసం రూ.లక్ష వరకు లాభాలు వస్తాయని చెప్పడంతో ఆయన నమ్మారు. అప్పుడప్పుడు రూ 50,000, రూ 20,000 పెట్టుబడులు పెడుతూ వచ్చారు. ఇలా దాదాపు రూ.ఆరు లక్షల వరకు కలర్స్ యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. మళ్లీ పెట్టిన పెట్టుబడులకు లాభాలు అకౌంటులో జమ కాకపోవడంతో తనకు లింకు వచ్చిన వాట్సాప్ నెంబరు ద్వారా గుర్తు తెలియని వ్యక్తిని సంప్రదించారు. వారు మళ్లీ అదనంగా రూ.లక్ష పెట్టాలని చెప్పారు. తన వద్ద అంత డబ్బుల్లేవని, తాను పెట్టిన పెట్టుబడి తిరిగి ఇవ్వాలని కోరడానికి మళ్లీ ఫోను చేశారు. అయితే వారి నుంచి సమాధానం లేకపోవడంతో మోసపోయానని తెలుసుకుని 1930కి ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వాహనదారుడికి

మూడురోజుల జైలు

- మరో 14 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు మరో 14 మందికి జరిమానా విధిస్తూ జిల్లా నాలుగవ అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి తెలిపిన వప్రకారం.. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ అనలైజర్లతో ట్రాఫిక్ పోలీసులు తనిఖీ చేస్తున్నారు. మోతాదుకు మించి మద్యం తాగిన వారిపై కేసులు నమోదు చేసి న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. ఈ క్రమంలో తిరుచానూరుకు చెందిన వపన్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మరో 14 మందికి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

కనుల పండువగా శ్రీనివాసుడి పుష్పపల్లకి

ఆణివార ఆస్థానం సందర్భంగా బుధవారం సాయంత్రం చిరుజల్లుల నడుమ పుష్పపల్లకీ సేవ కన్నుపండువగా జరిగింది. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించిన పల్లకీపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని కొలువుదీర్చి శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. పల్లకీలోని ఉత్సవ మూర్తులను భక్తులు దర్శించి ఆనందపరశులయ్యారు. ఆరురకాల సంప్రదాయ పుష్పాలు, మరో ఆరు రకాల స్వదేశీ, విదేశీ కట్‌ఫ్లవర్స్‌తో కలిపి మొత్తం టన్ను బరువు కలిగిన పుష్పాలను పల్లకి అలంకరణకు వినియోగించారు. వివిధ దేవతామూర్తుల ప్రతిమలను పల్లకీకి ఏర్పాటు చేశారు. పప్పపల్లకీ సేవకు ముందు వర్షం పడి నిలిచిపోయిన క్రమంలో ఆలయంపై ఏర్పడిన ఇంద్రధనస్సు భక్తులకు కనువిందు చేసింది. ఈఅందాల నడుమ పుష్పపల్లకీ ఉత్సవం శోభాయమానంగా దర్శనమిచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవంలో పాల్గొని ఉత్సవ మూర్తులను దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

రూ.2లక్షల పొదుపు నగదు స్వాహాపై ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుదూరు గ్రామంలో ఓ పొదుపు సంఘంలో రూ.2,09,000 నగదు స్వాహా అయినట్లు ఆ సంఘం సభ్యులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘంలో ఉన్న 11మంది సభ్యులు 2021లో బ్యాంకు నుంచి రుణం తీసుకున్నారు. అప్పటి నుంచి సభ్యులు కట్టిన నగదును బ్యాంక్‌లో చెల్లించకుండా లీడర్ స్వాహా చేసింది. కొద్ది రోజుల తరువాత గమనించిన సభ్యులు వెలుగు అధికారులకు తెలియజేశారు. దీంతో కొద్ది రోజుల తరువాత పొదుపు సంఘం లీడరు రూ.1,06,000 చెల్లించింది. మిగతా రూ.2,09,000 చెల్లించకపోవడంతో వెలుగు అధికారులతో కలసి పొదుపు సంఘం సభ్యులు బుధవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం: పాశిం

ఆర్టీసీ సర్వీస్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్ కుమార్

చిట్టమూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో బుధవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మొలకలపూడి, చిల్లమూరు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. చిట్టమూరు శివాలయంలో వద్దకు వాకాడు నుంచి మల్లాం, పూలతోట మీదుగా చెన్నై, మల్లాం నుంచి కొత్తగుంట మీదుగా తిరుపతికి రెండు ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే విద్యార్థుల కోసం కొక్కుపాళెం నుంచి మల్లాం వరకు ఆర్టీసీ సర్వీస్‌ను ప్రారంభించారు. అనంతరం మొలకలపూడి, చిల్లమూరు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, తహసీల్దారు సతీష్ కుమార్, టీడీపీ నాయకులు వి.రాజగోపాల్ రెడ్డి, గూడూరు నియోజకవర్గ పరిశీలకుడు శివకోటరెడ్డి, ఎం.జనార్ధనరెడ్డి, సునీల్‌రెడ్డి, డి.భారతమ్మ, హరికృష్ణా రెడ్డి, రాజేష్ రెడ్డి, కస్తూరయ్య, గుంపర్ల చిన్నారావు, కాపులూరు చెంచురామయ్య ఆచారి, దేవుడు, ఓమనరావు, ధనంజయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ

పెళ్లకూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా సవరణపై బీఎల్‌వోలకు బుధవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యువరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం

పీర్‌కుమార్‌ను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

గూడూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జాతీయ అవార్డు పురస్కారం అందుకున్న ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ పీర్‌కుమార్‌ను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ పీర్‌కుమార్ అధ్యాపకుడిగా పనిచేస్తూనే నాటక రంగంలో, రచయితగా రాణిస్తున్నారన్నారు. హైదరాబాదులోని త్యాగరాయ గానసభ ప్రాంగణంలో తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్- ఇంటర్నేషనల్ కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్, పీవీ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన ప్రతిభను గుర్తించి ఎన్టీఆర్ జాతీయ అవార్డును అందజేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సురేంద్ర, కోటేశ్వరరావు, శ్రీధర్‌శర్మ, రవిరాజు, లక్ష్మీహిమబిందు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

నాయుడుపేట: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు శివకవి ముకుంద అన్నారు. బుధవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. చెంగయ్య, లక్ష్మి, పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

...M/s. Shriram Finance Ltd., Naidupet బ్రాంచి మేనేజర్ వారు ...

SCHEDULE

...

S.Sreeramulu Yadav, M.A., B.L.,
Advocate, Off: 3-2-155, old Shar Busstand Road, Sullurpet. Cell: 94404 56976

వందేభారత్ రైలు స్టాపింగ్‌కు కృషి

గూడూరు అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి సికింద్రాబాదు, విజయవాడకు వెళ్లే వందేభారత్ రైళ్లను గూడూరు స్టేషన్‌లో ఆపేలా చర్యలు తీసుకోవాలని రైల్వే ఉన్నతాధికారులను కోరినట్లు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తెలిపారు.

సమస్యలను పరిష్కరించండి

గూడూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తూ టవర్‌క్లాక్ సెంటర్‌కు చేరుకుని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబరు 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు. గతంలో చేపట్టిన 17రోజుల సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలన్నారు. పలుమార్లు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసు కువెళ్లినా పరిష్కరించలేదని, ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, వెంకటరమణ, శివకుమార్, కామేశ్వరరావు, సుబ్బారావు, రమణయ్య, మురళి, బీవీ రమణయ్య, మణి, నారాయణమ్మ, వరలక్ష్మి, ప్రసాద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



విశ్వజిత్ రాణే - ప్రణీత

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, జూలై16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. గోవా మంత్రి విశ్వజిత్ రాణే, సినీ హీరోయిన్ ప్రణీత ఉన్నారు.

ఆధునికీకరించిన ల్యాబ్‌ను పరిశీలించిన ఈవో

తిరుమల, జూలై16(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పలు ప్రాంతాల్లో టీటీడీ ఈవో శ్యామలరావు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ అండ్ వాటర్ ల్యాబ్‌లో ఆధునీకరించిన యంత్రాలను పరిశీలించారు. నెయ్యిని వంద శాతం పరిశీలించేందుకు వీలుగా ఇటీవల ఏర్పాటు చేసిన గ్యాస్ క్రోమటోగ్రాఫీ(జీసీ), హై పెర్ఫార్మన్స్ లిక్విడ్ కోమటోగ్రాఫీ(హెచ్‌పీఎల్‌సీ) యంత్రాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఏఎన్సీ, హెచ్‌వీసీ ఉప విచారణ కార్యాలయాల వద్ద జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించి సూచనలు చేశారు. అంతకుముందు తిరుమలలోని అన్నమయ్య భవనానికి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రాన్ని పరిశీలించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఈఈ సుబ్రహ్మణ్యం, డిప్యూటీఈవోలు వెంకటయ్య, భాస్కర్, సోమన్నారాయణ, డీఈ చంద్రశేఖర్, హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్ ఇతర అధికారులు ఈవో వెంట ఉన్నారు.

ఫుడ్ వాటర్ ల్యాబ్‌లో పరీక్షల గురించి సిబ్బందితో మాట్లాడుతున్న ఈవో తదితరులు

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని తొమ్మిది షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.19 కోట్లు
మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,020
తలనీలాలు సమర్పించినవారు: 27,609

ఆయువు పోసే ఆలయం

హృద్రోగ బాధిత చిన్నారులకు అక్కడ ఊపిరిపోస్తారు. గుండె కవాటాలను సరిచేసి ప్రాణం నిలబెడతారు. ఆరోగ్య జీవితాన్ని ప్రసాదించి ఆయువునిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే గుండె సంబంధిత వ్యాధిగ్రస్థులకు అది ఆలయమే. పేదలకు అమూల్య సేవలందిస్తున్న పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ అనతికాలంలోనే హృదయాలయమనే పేరును సార్థకం చేసుకుంది. టీటీడీ ఆధ్వర్యంలోని బర్డ్ ఆస్పత్రి ప్రాంగణంలో ఈ సెంటర్ 2021లో ప్రారంభమై తన సేవలతో రోగుల హృదయంలో స్థానం సంపాదించుకుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- 4 వేల మంది చిన్నారులకు హృద్రోగ శస్త్రచికిత్సలు
- 20 మందికి విజయవంతంగా గుండె మార్పిడి
- రోగులను గుండెకు హత్తుకుంటున్న పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్

పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్

నవజాత శిశువుల నుంచి వృద్ధుల వరకు పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ గుండెకు హత్తుకుని ఆలంబనగా నిలుస్తోంది. మూడున్నరేళ్ల వ్యవధిలోనే గుండెకు సంబంధించి ఎన్నో సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేసి ఓ ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకుంది. రాష్ట్రంలో గుండె మార్పిడి చేసే ఏకైక ఆస్పత్రిగా గుర్తింపు సాధించింది. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి సారథ్యంలో 14 మంది వైద్యనిపుణులు నిరంతరం ఇక్కడ సేవలందిస్తున్నారు. తక్కువ కాలంలోనే 20మందికి గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేశారంటే విస్తుపోవాల్సిందే. ప్రమాదవశాత్తూ చనిపోయినవారి గుండెను గ్రీన్ చానల్ ద్వారా వాయువేగంతో తెచ్చి మృత్యువు అంచున చేరిన వారిని కాపాడుతున్నారు. నాలుగు వేల మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేసి వారిలో మళ్లీ చిరునవ్వులు పూయించారు. రోగులను ఇంతలా మానవీయ సేవలందిస్తున్న ఈ ఆస్పత్రి ప్రస్థానాన్ని చూసి అపోలో ఆస్పత్రుల ఛైర్మన్ ప్రతాప్ సి.రెడ్డి అచ్చెరువొందారు. రెండేళ్ల క్రితం ఆయన సెంటర్‌ను సందర్శించి వైద్యబృంద సేవలను కొనియాడారు. ఇంతకంటే గొప్పగా తమ ఆస్పత్రి ఉండదంటూ సంస్థ తరపున పరికరాలు అందజేస్తూ కితాబునిచ్చారు.

పేదలకు ఉచిత వైద్య సేవలు

టీటీడీ శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టు సహకారంతో నడుస్తున్న హార్ట్ సెంటర్‌లో వైద్యసేవలు పేదలకు ఉచితం. ఎన్టీఆర్ వైద్యసేవతో పాటు ఆయుష్మాన్ భారత్ కార్డులున్న వారికీ ఇక్కడ ఉచితంగా వైద్యం చేస్తున్నారు. మన రాష్ట్రానికి చెందిన వారే కాకుండా యూపీ, బిహార్, జార్ఖండ్, వెస్ట్ బెంగాల్, ఒడిశానుంచీ వస్తుంటారు. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ నుంచి కూడా హృద్రోగ బాధితులు వస్తున్నారంటే సెంటర్ విశిష్టత అర్థం చేసుకోవచ్చు. ఈ సేవలను గుర్తించిన ఆసియా టుడే రీసెర్చ్, మీడియా 2023లో బెస్ట్ పీడియాట్రిక్ కార్డియాక్ సెంటర్‌గా ఎంపిక చేసింది.

కొత్త భవనం నమూనా

చికిత్స పొందుతున్న చిన్నపిల్లల వార్డు

హార్ట్ సెంటరుకు శ్రీ'నాథుడు'

హార్ట్ సెంటర్ గుర్తింపు వెనుక డైరెక్టర్ శ్రీనాథ్ రెడ్డి విశేష ప్రతిభ,పెద్ద మనసు దాగి ఉంది. ఉత్తమ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్‌గా తన బృందానికి సమర్థ సారథ్యం వహిస్తున్నారు. దాతల ద్వారా వచ్చే అధునాతనమైన పరికరాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. పేరెన్నికగన్న కార్పొరేట్ ఆస్పత్రులు నెలకు రూ.10 లక్షలు జీతమిస్తామన్నా స్వామి సన్నిధిలో సేవ చేయడంలోనే ఆయన సంతృప్తి చెందుతారని శ్రీనాథ్ సన్నిహితులు చెబుతారు.తెలంగాణ గవర్నర్ తమిళసై నుంచి డాక్టర్ శ్రీనాథ్ అవార్డు అందుకున్నారు.

విస్తరణ దిశగా అడుగులు

హార్ట్ సెంటర్ మరింత విస్తరించనుంది. బర్డ్ ఆస్పత్రి పాత భవనంలో 70 పడకలతో తాత్కాలికంగా ప్రారంభమైన ఈ సెంటర్ ఇప్పుడు రూ.250కోట్లతో పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీగా రూపుదిద్దుకుంటోంది. ఇందులో 350 పడకలుంటాయి. 14 అదనపు పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీస్ సేవలు అందుబాటులోకి వస్తాయి. న్యూరాలజీ, కిడ్నీ వ్యాధులు, కాలేయం, హెమటో ఆంకాలజీ, తలసీమియా రోగులకు సేవలందిచడంతోపాలు బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ చికిత్స సైతం చేసేందుకు వడివడిగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఐకానిక్‌గా నిర్మిస్తున్న కొత్త భవనంలో మల్టీ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఎయిర్ అంబులెన్స్ యూనిట్ సైతం ఏర్పాటవుతోంది. మరో ఏడాదిలో హార్ట్ సెంటర్ మరింతగా ఎదిగేందుకు సమాయత్తమవుతోంది.

నా బిడ్డకు పునర్జన్మ

హైదరాబాద్‌లో నా భార్య బాబుకు జన్మనిచ్చింది. వెనువెంటనే పసికందుకు గుండె సమస్య ఉందని తేలింది. హైదరాబాదులో రూ. 6లక్షలు అవుతుందన్నారు. ఏం చేయాలో పాలుపోలేదు. తిరుపతి హార్ట్ సెంటర్ గురించి తెలుసుకుని ఈనెల 9న జాయిన్ చేశాం. 48 గంటల్లోనే వైద్యులు శస్త్రచికిత్స చేశారు. బిడ్డకు పునర్జన్మ ఇచ్చారు. ఈ ఆస్పత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.

- మురళి, ఆటోడ్రైవర్, సి.మల్లవరం, చిత్తూరు జిల్లా

నాకు కొత్త బతుకు ఇచ్చారు

మాది తూర్పుగోదావరి జిల్లా జి.రాగంపేట. మా నాన్న రైతు. గతేడాది డిసెంబరులో నాకు చాతిలో ఇబ్బంది వచ్చింది. చాలా ఊళ్లు తిరిగాం. తగ్గలేదు. చివరికి గుండె మార్పిడి చేయాలన్నారు. విశాఖ వైద్యుల సూచనతో ఈ ఏడాది జనవరి 21న తిరుపతి హార్ట్ సెంటర్‌కు వచ్చాం. దాత గుండె కోసం ఇక్కడే అద్దెకు ఇల్లు తీసుకుని ఎదురుచూశాం. మార్చి 2న గుండె దొరికిందని ఫోన్ చేశారు. విజయవాడలో బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోయిన వ్యక్తి నుంచి గుండెను ఆగమేఘాలపై తెచ్చి నాకు అమర్చారు. 40 రోజులు ఆస్పత్రిలోనే ఉన్నా. ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనాథ్ సర్ కొత్త బతుకునిచ్చారు. నెలకోసారి రివ్యూకి వస్తున్నా. ఇప్పుడు ఆరోగ్యం బాగుంది.

- వై. వినయ్, బి.ఫార్మసీ విద్యార్థి

ఘాట్‌లో అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

ప్రమాదానికి గురైన కారు, గాయపడిన భక్తులు

తిరుమల,జూలై16(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో బుధవారం ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. బెంగుళూరుకు చెందిన నలుగురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వినాయక స్వామి ఆలయానికి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సూళ్లూరుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం సూళ్లూరుపేటలో పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేపట్టారు. మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దీర్ఘకాలంగా కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు సంక్షేమ పథకాలను కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదైనా పట్టించుకోలేదన్నారు. జీవో నెంబరు 36 ప్రకారం వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు లక్ష్మయ్య, ఎస్కే రియాజ్, అక్బర్, నాగరాజు, మరళి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణాధ్యక్షుడి జన్మదిన వేడుకలు

సూళ్లూరుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఆర్టీసీ బస్టాండు సెంటర్, కోళ్లమిట్ట, మన్నారుపోలూరు ప్రాంతాల్లో అన్నదానం చేశారు. స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దంతాల రవి, కొండలరావు, ఈవీ సురేష్, కొమరంజేరి శ్రీధర్, ఆరణి చంద్రమోహన్, పెంచలయ్య, మేడా సాయినారాయణ, ఆలీభాయ్, మార్కేండేయులు, వంశీ, సత్యనారాయణ, సునీల్ పాల్గొన్నారు.

టీడీపీ నేతకు నెలవల పరామర్శ

జీవీఆర్ నాయుడిని పరామర్శిస్తున్న నెలవల తదితరులు

నాయుడుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, ప్రముఖ వ్యాపారవేత్త జీవీఆర్ నాయుడును సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం బుధవారం పరామర్శించారు. జీవీఆర్ నాయుడు ఇటీవల శస్త్రచికిత్స చేసుకున్నారు. ఆయనను నెలవలతో పాటు ఏఎంసీ మాజీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఉగ్గుమూడి భాస్కర్‌రెడ్డి, చంద్రా రెడ్డి, కరీముల్లా, న్యాయవాది గంగాప్రసాద్, రాజశేఖర్, గాంధీనాయుడు, జువ్వలపాటి మస్తాన్, ముత్యాలయ్య, తదితరులు పరామర్శించారు.

కాండం కుళ్లు తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

కోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో సాగులో ఉన్న వరిపంటలకు కాండం తొలుచు పురుగులు, కాండం కుళ్లు తెగుళ్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వీటిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్ అన్నారు.

రాజీయే రాజమార్గం

ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జి మీనాక్షి సుందరి, న్యాయవాదులు

నాయుడుపేట టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేసుల పరిష్కారంలో రాజీయే రాజమార్గమని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి బజారు మీదుగా బుధవారం నాయుడుపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మీడియేషన్ ఫర్ ది నేషన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జడ్జి మాట్లా డుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ మార్గంలో సత్వరమే పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే నగదు, సమయం ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆశా చెంచుకృష్ణయ్య, న్యాయవాదులు వెందోటి పార్థసారధిరెడ్డి, కిషోర్, దారా రవి, చదలవాడ కుమార్, రమణయ్య, నారాయణ, రఫీ, శ్రీనివాసులు, కిరణ్, దశయ్య, చెంగయ్య, హరనాథ్‌రెడ్డి, సోమశేఖర్, అర్బన్ సీఐ బాబి, కోర్టు సిబ్బంది బుచ్చిబాబు, అంజలి తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వ వ్యవస్థను వినియోగించుకోండి

పెళ్లకూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న సివిల్ వ్యవహారాలను శిక్షణ పొందిన మధ్యవర్తుల ద్వారా స్థానికంగానే పరిష్కరించుకోవాలని నాయుడుపేట సివిల్ కోర్టు జడ్జి పి.మీనాక్షీ సుందరి అన్నారు. బుధవారం పెళ్లకూరు మండలం పాలచ్చూరులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. తొలుత గ్రామ సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ చిన్నచిన్న విషయాలపై కోర్టులను ఆశ్రయించడం సరికాదన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే శిక్షణ పొందిన మధ్యవర్తి వ్యవస్థ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టే వారిపై చర్యలకు ప్రత్యేక చట్టం ఉందన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట బార్ అధ్యక్షుడు చెంచుకృష్ణ, సీనియర్ న్యాయవాది పార్థసారధిరెడ్డి, ఏజీపీ హరినాథరెడ్డి, పరుశురాం, నిరంజన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

వాకాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వాకాడు బీసీ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను బుధవారం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వాణిరెడ్డి పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వ సేవలపై అవగాహనకే 1కే రన్

సూళ్లూరుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పెండింగ్ కేసుల పరిష్కారం కోసం 1కే రన్ నిర్వహించారు. మధ్యవర్తిత్వ సేవలపై అవగాహన కల్పించడానికి స్థానిక మార్కెట్ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి పి.సంయుక్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఒక నిర్మాణాత్మక ప్రక్రియని, దీని ద్వారా 90రోజుల్లో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ మురళీకృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రకృతి కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ధర్మాప్రసాదరావు, ఎస్ఐ బ్రహ్మనాయుడు, న్యాయవాదులు లక్ష్మయ్య, గణపతి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో న్యాయమూర్తి సంయుక్త, పోలీసులు, న్యాయవాదులు

ఏడాదిలో 14 వేల ఇళ్ల నిర్మాణాలు

అధికారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ దయాకర్

సూళ్లూరుపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది చివరిలోగా జిల్లాలో 14 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గృహనిర్మాణశాఖ పీడీ ఈ.దయాకర్ తెలిపారు. బుధవారం ఆయన తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల గృహ నిర్మాణశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 7300 గృహాలు పూర్తయ్యాయని, మిగిలిన టార్గెట్‌ను కూడా పూర్తిచేసేలా దృష్టిసారించామన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరూ త్వరగా నిర్మాణాలు పూర్తి చేసేలా సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అలాగే నిర్మాణం పూర్తయిన ఇళ్లకు బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు ఇవ్వగా, ప్రస్తుతం గిరిజనలకు రూ.75 వేలు, ఎస్సీ బీసీలకు రూ.50 వేలు ఇంటికి అదనంగా ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అర్హులైన వారికి కొత్త ఇళ్లను కూడా త్వరలోనే మంజూరు చేస్తామని పీడీ చెప్పారు. అనంతరం మన్నారుపోలూరులో ఇళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఏ.శ్రీనివాస రావు, ఏఈ సత్యనారాయణ, గృహ నిర్మాణశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర వైపు పరుగులు

కోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ఏడాది పాలనలో రాష్ట్రం స్వర్ణాంధ్ర వైపు పరుగులు తీస్తోందని టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ అన్నారు. కోట పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీ, కోట క్రాస్‌రోడ్డులలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగుపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఏడాదిలో అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటా తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్, టీడీపీ నేతలు నౌషాద్, తిరుమలశెట్టి కోటేశ్వరరావు, మోహన్, కిరణ్, పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ పంచాయతీలపై దృష్టి పెట్టాలి

కోట, జూలై 16(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని పలు మండలాలలో ఉన్న స్వర్ణ పంచాయతీలపై దృష్టి పెట్టి అభివృద్ధికి బాటలు వేయాలని డీఎల్‌డీవో వాణిరెడ్డి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలలో తాగునీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు జరగరాదన్నారు. ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, డిప్యూటీ ఎంపీడీవో వేణు పాల్గొన్నారు.

మండల బీజేపీ కమిటీ ఏర్పాటు

ఓజిలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల బీజేపీ కమిటీని సూళ్లూరుపేట నియోజకవర్గం కన్వీనరు ఆదినారాయణరెడ్డి ప్రకటించారు. ఇప్పటికే మండల అధ్యక్షుడిగా బిల్లు పవన్‌కుమార్ ఎంపికైన విషయం తెలిసిందే. బుధవారం ఉపాధ్యక్షులుగా జి.మనోహర్, సాయిరామ్, గడీష్, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులుగా గోపాల్, గురుమస్తాన్ కోశాధికారిగా మురళిని ఎంపిక చేశారు.

మధ్యవర్తిత్వంతో త్వరితగతిన కేసుల పరిష్కారం

ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

గూడూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం వల్ల కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చునని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగపవన్ అన్నారు. బుధవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం - దేశం కోసం కార్యక్రమంపై స్థానిక కోర్టు సెంటర్ నుంచి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా శాంతియుత మార్గంలో త్వరితగతిన కేసులను పరిష్కరించుకునేందుకు వీలుంటుందన్నారు. దీనివల్ల సమయం, నగదు ఆదా చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు బీవీ.సులోచనారాణి, గాయత్రిదేవి, న్యాయవాదులు అరవ పార్వతయ్య, కోటేశ్వరరావు, ఏడుకొండలు, భాస్కర్‌రావు, మెహబూబ్‌బాషా, కోర్టు సిబ్బంది, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజీ కోసం మధ్యవర్తిత్వం చేసుకోవాలి

ర్యాలీ నిర్వహిస్తున్న వెంకటగిరి జడ్జి విష్ణువర్మ, న్యాయవాదులు

వెంకటగిరి టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులు మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని జడ్జి విష్ణువర్మ అన్నారు. బుధవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వెంకటగిరి పట్టణంలోని 'మధ్యవర్తిత్వం - దేశం కోసం' అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్నచిన్న తగాదాలకు కేసులు పెట్టుకుని సంవత్సరాల పాటు కోర్టులకు తిరిగి సమయం వృధా చేసుకోవద్దన్నారు. రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రమణ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.